www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -281 శనివారం 17 జనవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి

## నిర్మల్ బహిరంగ సభలో సిఎం రేవంత్ పిలుపు

**ఉమ్మడి జిల్లాకు యూనివర్సిటీ మంజూరు**

**బాసర ఐఐటిలోన క్యాంపస్ ఏర్పాటు చేస్తాం**

**నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు**

**పనుల కోసమే మోడీతో భేటీ అవుతూనే ఉంటా**

**తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టి తీరుతాం**

**కెసిఆర్ అప్పులతో తెలంగాణ కుప్పయ్యింది**

**చనాక-కొరాట బ్యారేజ్ నుంచి ప్రధాన కాలువకు సాగునీరు.. సదర్‌మాట్ బ్యారేజ్ ప్రారంభం**



ఆదిలాబాద్ **జనవరి 16ప్రజావినికిడి**

'గత ఎన్నికల్లో గెలిచాం.. రాబోయే ఎన్నికల్లోనూ గెలుస్తాం.. రాష్ట్రంలో మళ్లీ తిరిగి అధికారంలోకి వస్తాం. మున్సిపల్ ఎన్నికల్లో మంచి చేసే వారిని, అభివృద్ధి చేసే వారినే గెలిపించండి. నాకు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని మిగతా 2లో.

# ఏఐతో జాగ్రత్త

**అది సంపన్నుల ఆయుధం**

**భవిష్యత్తుకు భారీ ముప్పు**


**టెక్ నిపుణులకు తొలగింపు భయాలు**

**మంచి కంటే కీడే ఎక్కువ**

**: ఏఐ పితామహుడు హింటన్ హెచ్చరిక**







న్యూఢిల్లీ **జనవరి 16ప్రజావినికిడి**

ప్రస్తుతం ఎక్కడ విన్నా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) మాటే వినబడుతున్నది. ప్రతి ఒక్కరూ దీని గురించి తెలుసుకోవాలనే ఆరాటం, దీని మీద ఆధారపడి పనిని సులువు చేసుకుంటున్న తీరు కనబడుతుంది. ప్రస్తుతం టెక్ ప్రపంచంలో ఏఐ పరుగులు పెడుతోంది. ఈ ఏఐతో మంచి కంటే కీడే ఎక్కువగా ఉందనే ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతోన్న వేళ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పితామహుడు, నోబెల్ బహుమతి గ్రహీత జెఫ్రీ ఎవరెస్టు హింటన్ కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో...

# భారత్ కు మరిన్ని రఫేల్ యుద్ధ విమానాలు... డీపీబీ గ్రీన్ సిగ్నల్

**114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు ఆయుధ సేకరణ బోర్డు ఆమోదం**

**రక్షణ మంత్రి నేతృత్వంలోని డీఏసీ ముందుకు వెళ్లనున్న ఫైల్**

**వచ్చే నెలలోనే భారత్, ఫ్రాన్స్ మధ్య తుది ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం**

**హైదరాబాద్‌లోని టాటా ప్లాంట్‌లో రఫేల్ ఫ్యూజ్‌లేజ్‌ల తయారీకి ఒప్పందం**



న్యూఢిల్లీ **జనవరి 16ప్రజావినికిడి**

భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ నుంచి మరో 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసే ప్రతిపాదనకు ఆయుధ సేకరణ బోర్డు (డీపీబీ) శుక్రవారం ఆమోదం తెలిపింది. భారత వాయుసేన (ఐఏఎఫ్) గత ఏడాది ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖకు అధికారికంగా ప్రతిపాదన పంపిన విషయం తెలిసిందే.రక్షణ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రతిపాదన తదుపరి ఆమోదం మిగతా 2లో...

## మీ పాలనలో ఇంకెంతమంది బలి కావాలి

**గురజాలలో సాల్మన్ హత్యపై జగన్**



అమరావతి,**జనవరి 16ప్రజావినికిడి**

గురజాల నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్త సాల్మాన్ హత్యపై మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. చంద్రబాబు.. మీరు పాలించడానికి అర్హులేనా?.. రాజకీయ కక్షలతో ఎంతమంది ప్రాణాలను బలి తీసుకుంటారు? ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం,మిగతా 2లో...

## మరో ఇద్దరికి స్పీకర్ క్లీన్‌చిట్

**ఇంకా ముగ్గురిపై కొనసాగనున్న విచారణ**

**దానం రాజీనామా తప్పదా ?**



2లో.

# విద్య ద్వారానే జీవితాల్లో మార్పు

**నిరుద్యోగుల్ని బీఆర్ఎస్ మోసం చేసింది**

**వారి ఉద్యోగాలు పోతేనే.. మీకు ఉద్యోగాలొస్తున్నాయి**

**రెండేండ్లలో 70 వేల ఖాళీలు భర్తీ చేశాం**

**నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి**

**గ్రూప్ 3 అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్**జనవరి 16ప్రజావినికిడి**

ప్రజలకు పంచేందుకు భూముల్లేవనీ, విద్యను మాత్రమే అందించి వారి జీవితాల్లో మార్పు తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందని తెలిపారు. వివిధ శాఖల్లో గ్రూప్ 3 ఉద్యోగాలకు ఎంపికైన 1,370 మందికి శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మిగతా 2లో...

## 'స్టార్టప్ ఇండియా' మిషన్‌కు పదేళ్లు పూర్తి

**దేశ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు**

**దేశ యువత నిజమైన సమస్యలను పరిష్కరిస్తోందన్న మోదీ**

**పదేళ్లలో 500 నుంచి 2 లక్షలకు పైగా చేరిన స్టార్టప్‌లు**

**125కు పైగా యూనికార్న్‌లతో ప్రపంచంలో మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్**

**స్టార్టప్‌లలో మహిళల భాగస్వామ్యం పెరిగిందన్న ప్రధాని**



2లో.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్ రెండో దశ పనుల పురోగతిపై లేఖ రాసిన కేంద్ర మంత్రి**

**మెట్రో రెండో దశ గురించి కేంద్ర మంత్రితో చర్చించానన్న కిషన్ రెడ్డి**

# తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్

**రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో అభివృద్ధి**

**క్యాంపు కార్యాలయంలో అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష**

అమరావతి,**జనవరి 16ప్రజావినికిడి** తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో ఈ కేంద్రం ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మిగతా 2లో...



# తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్

(మొదటి పేజి తరువాయి)

ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా, వారికి అన్ని విధాలా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు భవిష్యత్తులో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు.. ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని సీఎం తెలిపారు. వివిధ రంగాల్లో కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్ల డివైజెస్-సెన్సర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, రూరల్ ఏరియా టెక్నాలజీ వంటి రంగాలు భవిష్యత్తులో కీలకం కానున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగా పాలసీలు రూపొందిస్తోందని వివరించారు. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలను ప్రోత్సహిస్తోందని సీఎం తెలిపారు. దేశంలో తొలిసారిగా గ్రీన్ ఎనర్జీ రంగంలో.. గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ తరహాలో కొత్త ఆవిష్కరణలకు.. వివిధ స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రం వేదికగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు భవిష్యత్తులో డిమాండ్ ఉన్న రంగాలకు పెద్దపీట వేయడమే కాకుండా.. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి అతి పెద్ద రీసెర్చ్ కేంద్రం అవసరమన్న సీఎం.. తిరుపతిలో ఏర్పాటు చేసే ఏపీ-ఫస్ట్ వ్యవస్థ ఆ అవసరాలను తీర్చేలా ఉండాలన్నారు. రాష్ట్రంలోని యువతకు సహకరించేలా పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. తిరుపతిలోని ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ రెండు ప్రముఖ జాతీయ విద్యా సంస్థల కాంబినేషన్లో ఏపీ ఫస్ట్ ఏర్పాటు కానుందన్న చంద్రబాబు.. దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలని స్పష్టంచేశారు. ఏపీ ఫస్ట్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరపాలని సూచించారు.

# విద్య ద్వారానే జీవితాల్లో మార్పు

(మొదటి పేజి తరువాయి)

నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పదేండ్లలో ఆ పార్టీ నేతలు సొంత లాభం చూసుకున్నారే తప్ప నిరుద్యోగులను పట్టించుకోలేదన్నారు. ఓయూ విద్యార్థులు ఉద్యమకారులై ప్రాణత్యాగాలు చేసి సాధించిన తెలంగాణలో వారొక్క కుటుంబమే బాగుపడిందని ఆరోపించారు. వారి ఉద్యోగాలు ఊడితే తమకు ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకుందని అన్నారు. 14 ఏండ్ల పాటు గ్రూప్-1 ఖాళీలు భర్తీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఒకట్రెండు నోటిఫికేషన్లు ఇచ్చినా పేపర్ లీక్‌లతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయతను బీఆర్ఎస్ ప్రభుత్వం దెబ్బతీసిందని వ్యాఖ్యానించారు.

తాము అధికారం చేపట్టిన తర్వాత టీజీపీఎస్సీని బలోపేతం చేసి విద్యావంతులను, నిష్ణాతులను సభ్యులుగా నియమించామని చెప్పారు. ఇటీవల గ్రూప్-1 నియామక పత్రాలు ఇచ్చే సమయంలో కూడా కోర్టుకు వెళ్లి కుట్రలు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో 60 వేలు, రెండో ఏడాది 10 వేలు, మొత్తం రెండేండ్లలో 70 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని సీఎం తెలిపారు. "కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన మీరు మీ తల్లిదండ్రుల కండ్లల్లో సంతోషం నింపాలి. పుట్టిన బిడ్డ ప్రయోజకుడైతే వారి ఆనందా నికి అవధులుండవు. ఉద్యోగాలు భర్తీ చేయడం మా బాధ్యత. కానీ మీకు జీవితకాల విజయం. ఉద్యోగం మీ కుటుంబంలో భవిష్యత్ తరాలకు దిక్సూచిగా మారుతుంది. కేవలం వేతనం తీసుకునేది మాత్రమే కాదని.. ఉద్యోగం భావోద్వేగం అని గుర్తుంచుకోండి. తెలంగాణ పునర్నిర్మాణంలో కలిసి రావాలి. అందరు కలిసికట్టుగా పని చేస్తే ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తాం. రాష్ట్ర ప్రభుత్వంలో 10.5 లక్షల మంది ఉద్యోగులు వివిధ దశల్లో ఉన్నారు. వారి అడుగు జాడల్లో నడిచి సర్కార్‌కు మంచి పేరు తేవాలి" అని సీఎం వారికి దిశా నిర్దేశం చేశారు.

ఏ దేశమైనా, ఏ సమాజమైనా విద్యతోనే అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ మొదటి ప్రధాని పండిట్ జవహార్ లాల్ నెహ్రూ మొదటి ప్రాధాన్యతగా విద్య, వ్యవసాయాన్ని తీసుకున్నారని గుర్తు చేశారు. దేశంలోని అన్ని యూనివర్సిటీలు, శ్రీశైలం, నాగార్జున సాగర్, ఎస్ఆర్ఎస్పీ లాంటి ప్రాజెక్ట్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. అయితే నేడు విద్య, ఆహారం అందరికీ అందుతున్నా నాణ్యమైనది దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది, 11 వేల ప్రయివేట్ పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. ఈ వ్యత్యాసం ఎందుకుంది? తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎందుకు ప్రయివేట్ స్కూళ్లలో చదివిస్తున్నారో ఆలోచించాలన్నారు. వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నా మన పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని ఎందుకు అందించలేకపోతున్నామని ప్రశ్నించారు. ఈ క్రమంలో తమ సర్కార్ నాణ్యమైన విద్య, ఆహారాన్ని పిల్లలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. పిల్లలు తాము అభ్యసించిన విద్యలో నాణ్యత లేక పోతే అవకాశాలు కూడా దొరకవని హెచ్చరించారు. "రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది ఇంజినీరింగ్ పట్ట భద్రులు వస్తున్నా వారికి తగిన ఉద్యోగం రావడం లేదు. డిమాండ్ ఉంది. సరఫరా ఉంది. కాని స్కిల్స్ లేకపోవడమే కారణం. రేపటి రోజుల్లో స్కిల్స్ అభివృద్ధి చేయాలి. ఇవ్వడానికి భూముల్లేవు. కానీ విద్య ఒక్కటే మన జీవితాల్లో మార్పు తెస్తుంది. సీఎస్, డీజీపీ వరకు ఉద్యోగాలు అందరికి విద్య ద్వారానే వచ్చాయి. ప్రసుత్తం నియామక పత్రాలు అందుకుంటున్న 1,370 మందికి ఉద్యోగాలు విద్య వల్లనే వచ్చాయి. ఈ ప్రభుత్వానికి వారధులు, సారథులు మీరే. 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్లకు తీసుకుపోవాలనేది కేంద్ర సర్కార్ లక్ష్యం.

అదే స్ఫూర్తితో తెలంగాణ ఎకానమిని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల మార్క్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశ జనాభాలో 2.5 శాతంగా ఉన్న మనం 5 శాతం ఎకానమిని అందిస్తున్నాం. 2047 నాటికి 10 శాతం అందించాలనేదే లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో మీరందరూ నిబద్ధతతో పని చేయండి. విధుల్లో చేరిన రోజు ఎంత నిబద్ధతతో పని చేశారో.. అదే నిబద్ధతతో రిటైర్మెంట్ వరకూ పని చేయాలి" అని సీఎం రేవంత్ రెడ్డి వారికి సూచించారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు తమ తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం చేసిన వారి జీతంలోంచి 15 శాతం కోత విధించి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. "అశోక్‌నగర్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వరకు ఏం జరుగుతుందో నాకు అవగాహన ఉంది. రాబోయే రోజుల్లో అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తాం. ప్రయివేట్‌లో సైతం భారీ పెట్టుబడులు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తాం" అని సీఎం నిరుద్యోగులకు భరోసా ఇచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి

(మొదటి పేజి తరువాయి)

ప్రజలకు మంచి చేయడా నికే ఉపయోగిస్తా' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభిం చారు. మొదట ఆదిలాబాద్ జిల్లాలోని బోరజ్ మండలంలోని చనాక-కొరాట బ్యారేజ్ నుంచి ప్రధాన కాలువకు సాగునీరు వదిలారు. నిర్మల్ జిల్లాలోని మామడ మండలంలో గల సదర్‌మాట్ బ్యారేజ్‌ని ప్రారంభించారు. అనంతరం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన -- ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేక అభిమానం అని, జల్ జంగల్ జమీన్ అని నినదించిన పోరాటాల గడ్డ ఇది అని తెలిపారు.

పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు కేటాయించాలనుకుంటున్న యూనివర్సిటీని నిర్మల్ జిల్లా బాసరట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేస్తామన్నారు. యూనివర్సిటీని అన్ని ప్రాంతాల నాయకులు తమ ప్రాంతానికే కేటాయించాలని కోరుతున్నారన్నారు. అందుకే బాసరలో ఏర్పాటు చేస్తామని నాయకులందరూ సహకరించాలని కోరారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల లక్షల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు తట్టెడు మట్టి తీయలేదని, ఆ ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. బడ్జెట్ సమావేశాలలోపు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై సంపూర్ణ నివేదిక ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచించారు. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు ఒక్కటే ఏర్పాటు చేసుకుంటే సరిపోదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అందుకు 10వేల ఎకరాలు అవసరం ఉందని తెలిపారు. నిర్మల్ జిల్లాలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంద్రవెల్లి నాగోబా జాతరకు రూ.22కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ప్రజల కోసం.. ప్రాంత అభివృద్ధి కోసం ఎవరినైనా కలవడానికి వెనకాడనని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, నిధుల కోసం ప్రధానిని ఎన్నిసార్లయినా కలుస్తానని తెలిపారు. ఇందుకు బీజేపీ ప్రజా ప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్ రెండో దశ పనుల పురోగతిపై లేఖ రాసిన కేంద్ర మంత్రి**

**మెట్రో రెండో దశ గురించి కేంద్ర మంత్రితో చర్చించానన్న కిషన్ రెడ్డి**

**జనవరి 16ప్రజావినికిడి**



మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న కేంద్ర మంత్రి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై ఆయన ఈ లేఖ రాశారు. మెట్రోను ఎల్ అండ్ టీ నుండి స్వాధీనం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని మీరే ప్రకటించారని రేవంత్ రెడ్డికి గుర్తు చేశారు. మెట్రో రెండో దశ నిర్మాణం గురించి తాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించానని, అయితే ముందుగా మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారని అన్నారు. ఇందుకు సంబంధించి నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలని, ఆ తర్వాత రెండో దశ మెట్రో నిర్మాణంపై కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం అంగీకరించిందని ఆ లేఖలో కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్రం, రాష్ట్రం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయించినట్లు కూడా ఖట్టర్ తనకు తెలిపారని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, కానీ ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను పంపించాలని కోరారు.

## స్టార్టప్ ఇండియాకు పదేళ్లు..

## దేశ యువతపై ప్రధాని మోదీ ప్రశంసలు

భారత యువత ఆవిష్కరణలు, నూతన ఆలోచనలతో నిజమైన సమస్యలను పరిష్కరించే మార్గంలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని ప్రారంభించిన 'స్టార్టప్ ఇండియా' మిషన్ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాడు ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్ల ప్రయాణం కేవలం ప్రభుత్వ కార్యక్రమ విజయం మాత్రమే కాదని, లక్షలాది యువత కలలు సాకారమైన ప్రయాణమని ఆయన అభివర్ణించారు.

పదేళ్ల క్రితం దేశంలో 500 కంటే తక్కువ స్టార్టప్‌లు ఉండేవని, ఇప్పుడు ఆ సంఖ్య 2 లక్షలకు పైగా చేరిందని ప్రధాని గుర్తుచేశారు. అప్పట్లో కేవలం నాలుగు యూనికార్న్‌లు (ఒక బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన స్టార్టప్) ఉంటే, ఇప్పుడు 125కు పైగా క్రియాశీల యూనికార్న్‌లు ఉన్నాయని, ఈ అద్భుతమైన వృద్ధి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని వివరించారు. ఈ ప్రగతితో భారత్, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. ఈ స్టార్టప్‌లు డీప్ టెక్, స్పేస్ టెక్, డ్రోన్ టెక్, క్వాంటం టెక్, అగ్రిటెక్, ఏఐ/ఎంఎల్ వంటి 50కి పైగా రంగాల్లో పనిచేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తున్నాయని ప్రధాని అన్నారు. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కథనం ప్రకారం, ఈ స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా 21 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలను సృష్టించాయి. స్టార్టప్ ఇండియా మిషన్‌లో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని మోదీ అన్నారు. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు 45 శాతం వాటిలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ లేదా భాగస్వామి ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా, సుమారు సగం స్టార్టప్‌లు నాన్-మెట్రో నగరాల్లోనే ఉండటం, ఆవిష్కరణల కేంద్రాలుగా టైర్-2, 3 నగరాలు ఎదుగుతున్నాయనడానికి నిదర్శనమన్నారు.

# మీ పాలనలో ఇంకెంతమంది బలి కావాలి

(మొదటి పేజి తరువాయి)

పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇన్ని అరాచకాలకు పాల్పడతారా? అని ప్రశ్నించారు. ఇక, మీ కక్షల పాలన ఫలితంగా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన మా పార్టీ కార్యకర్త, ఒక దళితుడైనా మందా సాల్మన్ హత్యకు గురైన ఘటనపై మీరు ఏం సమాధానం చెప్తారు? అని క్వశ్చన్ చేశాడు. అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూడ్డానికి సాల్మన్ సొంత గ్రామానికి వెళ్తే ఇనుప రాడ్లతో కొట్టి హత్యచేస్తారా? అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ముమ్మాటికీ తమ పార్టీని భయ పెట్టడానికి మీరు, మీ పార్టీ నేతలు కొంతమంది పోలీసులు ద్వారా చేస్తున్నారని మాజీ సీఎం జగన్ అన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా, మీరు అజమాయిషీ చెలాయిస్తూ, ఊళ్లో మీకు గిట్టని వారు ఉంటే చంపేస్తామని మీ ఎమ్మెల్యే, మీ పోలీసుల బెదిరింపులతో పిన్నెల్లి గ్రామం నుంచి వందల మంది వైయస్సార్ పార్టీ కార్యకర్తల కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని ఆరోపించారు. ఇదొక్కటే కాదు, అసెంబ్లీ ఎన్నికలు ముగిసింది మొదలు ఇలాంటి ఎన్నో ఘటనలు పల్నాడు సహా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అయితే, ఇంత జరుగుతున్నా సిగ్గు లేకుండా మారణకాండను ఈ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. పౌరులకు రక్షణ కల్పించడం, వారు స్వేచ్ఛగా తమ జీవితాలను గడిపేలా చూడ్డం మీ బాధ్యత కాదా?.. అలాంటి బాధ్యతలను నిర్వర్తించడంలో మీరు విఫలం చెందడం, పైగా మీరే మీ కక్షల కోసం శాంతి భద్రతలను దెబ్బ తీసి హత్యా రాజకీయాలకు వెన్నుదన్నుగా నిలవడం దుర్మార్గమైన విషయం కాదా? అని ప్రశ్నించారు. మీరు ముఖ్యమంత్రిగా ఉండి చేస్తున్న రాజ్యాంగ ఉల్లంఘన కాదా? చంద్రబాబు.. హింసా రాజకీయాలకు పాల్పడుతున్న మిమ్మల్ని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరు.. తప్పకుండా ఇలాంటి ఘటనలకు మీరు మూల్యం చెల్లించాల్సి వస్తుందని మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు.

# ఏఐతో జాగ్రత్త

(మొదటి పేజి తరువాయి)

ఏఐ సంపన్నుల చేతుల్లో ఆయుధంగా మారుతుందనీ, తక్కువ పెట్టుబడితో ఇబ్బడి ముబ్బడిగా లాభాలు ఆర్జిస్తారనీ, అదే సమయంలో టెక్ నిపుణులను భారీగా తొలగిస్తారని స్పష్టం చేశారు. భవిష్యత్ టెక్ ప్రపంచ ఎలా ఉండబోతున్నదనేది హింటన్ వెల్లడించారు.

**ఇది పెట్టుబడిదారీ విధానం : హింటన్**

బ్రిటిష్-కెనడియన్ జాతీయుడైన జెఫ్రీ ఎవరెస్టు హింటన్ కంప్యూటర్ సైంటిస్టు, కాగ్నిటివ్ సైకాలజిస్టు, నోబెల్ బహుమతి గ్రహీత. ఏఐ న్యూరల్ నెట్‌వర్క్‌లపై చేసిన పరిశోధనలకు ఆయన ప్రసిద్ధి చెందారు. హింటన్ మాట్లాడుతూడ ఏఐ భవిష్యత్‌లో తీవ్ర ముప్పును కలిగించే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంపన్నులు, బడా పారిశ్రామికవేత్తలు ఏఐని ఉపయోగించి, ఉద్యోగుల సంఖ్యను అమాంతం తగ్గిస్తారనీ, కొత్త నియామకాలు నిలిపివేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో నిరుద్యోగం ఊహించని స్థాయికి చేరుకుంటుందనీ, అంచనాలకు అందని విధంగా కంపెనీల యజమానులు దండిగా లాభాలు సంపాదిస్తారన్నారు. ఫలితంగా కొద్ది మంది సంపన్నులుగా మారుతారనీ, 90 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగజారుతారని హెచ్చరించారు. ఇది ఏఐ తప్పిదం కాదనీ, పెట్టుబడిదారుల విధానం అని ఆయన వివరించారు.

**నిరుద్యోగం కంటే భారీ ముప్పు పొంచి ఉంది : హింటన్**

ఉదాహరణకు పదివేల మంది కష్టపడి ఒక అంశాన్ని నేర్చుకుంటే, దీనంతటినీ ఏఐ తక్షణమే నేర్చుకుంటుంది. ఏఐ తయారీ సంస్థలు తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించేలా సాంకేతికతకు ప్రాధాన్యతనిచ్చి అభివృద్ధి చేశాయని హింటన్ అన్నారు. ఏఐ రాకతో ప్రారంభ దశలో నియమించుకునే గ్రాడ్యుయేట్ల ఎంపికలు తగ్గాయనీ, ముమ్ముందు పనిచేస్తున్న వారిని ఇంటికి పంపనున్నారని న్యూయార్క్‌కు చెందిన ఫెడరల్ రిజర్వ్ సర్వేలో వెల్లడయ్యిందని తెలిపారు. అయితే హెల్త్ కేర్ రంగంలో ఏఐ ప్రభావం అంతగా ఉండదన్నారు. ప్రస్తుతం ఏఐ వేగాన్ని గమనిస్తే 2026 తొలి నాళ్లలోనే నిరుద్యోగ సమస్య పెరుగుదలకు దారితీసే ప్రమాదముందని తెలిపారు. ఉద్యోగాల విషయాన్ని పక్కనపెడితే అంతకన్నా భారీ ముప్పు పొంచి ఉందని హింటన్ హెచ్చరించారు. లాభాల వేటలో పరుగెత్తే కంపెనీలు రక్షణ నిబంధనలను విస్మరించే అవకాశముందన్నారు. ఏఐతో ముమ్ముందు ఇంకా ఎన్ని పరిణామాలు చోటు చేసుకుంటాయో చెప్పడం కష్టమని, మంచి, చెడులు ఉన్నాయని హింటన్ అభిప్రాయపడ్డారు.

# భారత్ కు మరిన్ని రఫేల్ యుద్ధ విమానాలు... డీపీబీ గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజి తరువాయి)

కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ కొనుగోలు మండలి (డీఏసీ) ముందుకు వెళ్లనుంది. అనంతరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ దీనికి తుది ఆమోదముద్ర వేయనుంది. అంతా సవ్యంగా జరిగితే వచ్చే నెలలోనే భారత్, ఫ్రాన్స్ మధ్య ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉంది. ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా ప్రభుత్వాల మధ్య ఈ కొనుగోలు ప్రక్రియ జరగనుంది. ఇదిలా ఉండగా, భారత నౌకాదళం కోసం రూ.63,000 కోట్ల విలువైన 26 రఫేల్-మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు గతేడాది ఏప్రిల్‌లో భారత్, ఫ్రాన్స్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా 22 సింగిల్-సీటర్ యుద్ధ విమానాలు, నాలుగు ట్విన్-సీటర్ శిక్షణ విమానాలు 2031 నాటికి అందనున్నాయి.

మరోవైపు, దేశీయంగా విమానయాన తయారీ రంగాన్ని బలోపేతం చేసే క్రమంలో డసో ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ మధ్య ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం, హైదరాబాద్‌లోని టాటా ప్లాంట్‌లో రఫేల్ విమానాల ఫ్యూసిలేజ్‌లను తయారు చేయనున్నారు. 2028 ఆర్థిక సంవత్సరం నుంచి ఇక్కడ ఉత్పత్తి ప్రారంభం కానుంది.

# మరో ఇద్దరికి స్పీకర్ క్లీన్‌చిట్


హైదరాబాద్**జనవరి 16ప్రజావినికిడి**

తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో మరో ఇద్దరికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. సుప్రీంకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో ఒకరోజు ముందే తీర్పు ప్రకటించారు. ఇంకా ముగ్గురిపై విచారణ కొనసాగుతున్నది. మొత్తం పది మంది శాసన సభ్యులకుగాను స్పీకర్ ఇప్పటికే ఏడుగురికి అనర్హత విషయంలో క్లీన్‌చిట్ ఇచ్చినట్టయింది. పార్టీ మారినట్టు ఏలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. వారంతా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నట్టు తీర్పులో పేర్కొన్నారు. ఈ ఫిరాయింపుల వ్యవహారం తెలంగాణలో రాజకీయంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సంక్రాంతి పండుగ రోజైన గురువారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్యపై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్లను స్పీకర్ తిరస్కరించారు. పార్టీ మారినట్టు ఆధారాల్లేవనీ, వీరిద్దరిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్టు ఆయన తేల్చారు. అలాగే ఇంతకుముందు ఐదుగురిపై కూడా స్పీకర్ ఇలాంటి నిర్ణయమే తీసుకున్న విషయం తెలిసిందే. కాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య తదితరులు 2024 లో కాంగ్రెస్‌లో చేరినట్టు బీఆర్ఎస్ ఆరోపించిన విషయం విదితమే. అంతేగాక వీరిపై బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల పై అనర్హత వేటు వేయాలని కోరారు. అయితే స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది. తాజాగా శుక్రవారం మరో రెండు వారాల సమయం ఇస్తూ సుప్రీం ఆదేశాలిచ్చింది. ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు తప్పకపోవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతున్నది. దానం పార్టీ మారడమేగాక సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున లోక్‌సభ బరిలో నిలిచి ఓడిపోయారని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. దీంతో ఆయన పరిస్థితి ప్రస్తుతం అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. గెలిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకున్న దానం నాగేందర్, ఇప్పుడు పదవీగండాన్ని ఎదుర్కొంటున్నారు. అలాగే కడియం శ్రీహరి సైతం తన కూతురు కడియం కావ్య వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేసిన సందర్భంగా ఆమె నామినేషన్ పత్రంలో సంతకం పెట్టారు. ఇది కూడా ఆయన పదవికి ముప్పుతెస్తుందనే ప్రచారం రాజకీయ విశ్లేషకుల్లో జోరుగా జరుగుతున్నది.

# పెద్దగొల్లగూడెంలో సంక్రాతి ఉత్సవాలు



**ప్రజావినికిడి,(వాజేడు):జనవరి 16,**
పెద్దగొల్లగూడెంలో సంక్రాతి పండుగ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రోజు గ్రామంలో శ్రీ రామాలయం లో అన్నసంతార్పణ కార్యక్రమం జరిగింది దీనిని గ్రామంలో అందరు కలిసి జరుపుకుంటారు.దీనికి ప్రతి ఇంటి నుండి బత్యం అంటే బియ్యం కూరగాయలు దానికి కావలసిన సామాన్లు అన్ని వసులు చేసి గుడివద్ద ఉదయాన్నే వంటలు వండుతారు. మద్యాహ్నం సమయంలో గుడిలో భజనలు చేసి దేవునికి సమర్పించిన తర్వాత గ్రామంలో ఉన్న పెద్దలు మహిళలు పిల్లలు అందరు కలిసి బోజనాలు చేస్తారు. శుక్రవారం రోజు ఇంటివద్ద ఎవ్వరు వంటలు వండుకోరు అందరు గుడి దగ్గరకి రావల్సిందే అన్నసంతార్పణ తర్వాత సాయంత్రం దేవుని ఊరేగింపు చేస్తారు దీనితో సంక్రాతి పండుగ ముగుస్తుంది అని గ్రామ పెద్దలు తెలిపారు.ఇది మా గ్రామంలో పూర్వకాలం నుండి వస్తున్న ఆచారం అని తెలిపారు.



**చంపాపేట డివిజన్ పరిధిలోని మాధవ నగర్ కాలనీ నందు సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంట్లో పాలు పొంగించి,చిన్నారికి భోగి పండ్లు పోయడం జరిగింది.**



# చెరుకూరుగ్రామ పంచాయతీలో ముగ్గుల పోటీలు





**ప్రజావినికిడి ,(హైదరాబాద్):**
చెరుకూరు గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం రోజు శ్రీ వెంకటేశ్వర బోరువెల్ కొత్తగట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళల కోసం నిర్వహించిన ముగ్గుల పోటీలు అత్యంత ఉత్సాహంగా, వైభవంగా జరిగాయి.
ఈ కార్యక్రమానికి చెరుకూరు గ్రామ సర్పంచ్ వాసం రాజబాబు అధ్యక్షత వహించగా,గ్రామ వార్డు సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
ఈ పోటీలకు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రంత్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, పోటీదారులను అభినందించారు. అలాగే వాజేడు మండల సీనియర్ నాయకులు ఎల్లయ్య,పోలూరి వేణుగోపాల్,కోడె ధనంజయి, మల్లికార్జున రావు గారు ప్రత్యేకంగా హాజరై పోటీలకు మద్దతు తెలిపారు.మొత్తం 16 మంది మహిళలు ఈ ముగ్గుల పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ప్రతి ముగ్గు ఆకట్టుకునే విధంగా,సంప్రదాయ కళా నైపుణ్యాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.పోటీల్లో విజేతలుగా ప్రథమ బహుమతి పాయం శృతి 2,016/- ద్వితీయ బహుమతి పోడెం రక్షిత 1,016/ తృతీయ బహుమతి తోలెం రవళి 501/-గా ప్రకటించి బహుమతులు అందజేశారు.అంతేకాకుండా, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమం గ్రామంలో పండుగ వాతావరణాన్ని సృష్టించి,మహిళల ప్రతిభను ప్రోత్సహించేలా నిలిచింది.గ్రామస్తులు,పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన

**వానాకాలం సీజన్‌లో కందుల కొనుగోళ్లు**
**లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యం**
**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




ఖమ్మం,**జనవరి 16ప్రజావినికిడి**
రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025-2026 సీజన్‌లో కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఓ÷ూఖ కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల. వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 ఓ÷ూఖ నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన.వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకు రావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

# సుప్రీం ఆదేశాలను ధిక్కరించిన స్పీకర్

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ధిక్కరణ కేసు**
**అనర్హత ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడంలో కాలయాపన**
**కేసు దాఖలు చేసిన తెలంగాణ బిజెపి నేత**

హైదరాబాద్,**జనవరి 16ప్రజావినికిడి** తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు మరో కీలక దశకు చేరుకుంది. పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ తెలంగాణ బీజేపీ(÷్గ÷జీనిణజీనిజీ ఃఏఖ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదని పేర్కొంటూ.. తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను తెలంగాణ బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ విషయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో తెలంగాణ భాజపా నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ



అంశంలో పలువురు ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరికొందరిపై నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టారు. దీంతో స్పీకర్‌పై భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పినా.. ఆ సూచనను స్పీకర్ పాటించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలను కూడా పిటిషన్‌లో పొందుపరిచారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై గతంలో విచారణ జరిపిన సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆదేశించింది. అయితే.. నిర్ణీత గడువు ముగిసినా ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఇది న్యాయస్థానం ఆదేశాల ఉల్లంఘన కిందకు వస్తుందని బీజేపీ తన పిటిషన్‌లో స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకపోవడమే కాకుండా.. కావాలనే తన నిర్ణయాన్ని ఆలస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌లో కోరారు. కోర్టు ఆదేశాలు అమలు జరగలేదని... ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నం, పార్టీ ఫిరాయింపులను చట్టబద్ధం చేసే పరిస్థితి వంటివి ఉన్నాయని పిటీషన్‌లో ప్రస్తావించింది బీజేపీ. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పష్టత లేకపోవడాన్ని స్పీకర్ నిర్ణయం ఎందుకు ఆలస్యమవుతోందో చూపిస్తున్నాయని బీజేపీ వాదిస్తోంది.

# ఉప్పల నివాసం లో సంక్రాంతి సంబరాలు



**ప్రజావినికిడి,(నాగోల్):**
సంక్రాంతి పండుగను పురస్కరించుకుని టిపిసిసి ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అలాగే రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ, ఈ సంక్రాంతి పండుగ మీ జీవితాల్లో సరికొత్త కాంతిని ఇవ్వాలని అన్ని వర్గాల ప్రజలు పాడిపంటలతో సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ ప్రజలందరికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.సంక్రాంతి పండుగ అందరికీ ఆరోగ్యం, ఆనందం,శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐవి ఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న ,పెద్ద కుమారుడు ఉప్పల సాయి కిరణ్,కోడలు శార్వారీ చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండగ సందర్బంగా ఆటల పోటీలు



**ప్రజావినికిడి,(వాజేడు):జనవరి16,**
టేకులగూడెం గ్రామపంచాయతీలో గల కొత్త టేకులగూడెం గ్రామంలో మకర సంక్రాంతి సందర్భంగా గ్రామ పెద్దలు అలోచించి ఎంతో ఖర్చు పెట్టి గిఫ్ట్స్ తీసుకొని పిల్లలకి అవుట్డోర్ గేమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిడెం బాలకృష్ణ రిబ్బన్ కట్ చేసి ఆటలను ప్రారంభించి గ్రామస్తులకు పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.పండగ పూట పిల్లను సంతోషాపరిచడానికి ఈ విదంగా ప్రత్యకమైన గేమ్స్ ఏర్పాటు చేశామని గ్రామస్థులు అన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ చీడెం బాలకృష్ణ,ఉపసర్పంచ్ వాసం శైలజ,మాజీ సర్పంచ్ వాసం ఆనందరావు,గ్రామ పెద్దలు యాలం రామూర్తి,వాసం పాపారావు,వాసం అచ్చుయ్య,యాలం రాంబాబు,వార్డు సభ్యులు,వాసం సందీప్,నల్లే మల్లీ ఖార్జున్ రావు,వాసం రజిని తదితరులు పిల్లలు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పెద్దగొల్లగూడెంలో సంక్రాతి ఉత్సవాలు







**ప్రజావినికిడి(వాజేడు):జనవరి 16,** పెద్దగొల్లగూడెంలో సంక్రాతి పండుగ ఘనంగా నిర్వహించారు ఈరోజు గ్రామంలో శ్రీ రామాలయం లో అన్నసంతార్పణ కార్యక్రమం జరిగింది. దీనిని గ్రామంలో అందరు కలిసి జరుపుకుంటారు దీనికి ప్రతి ఇంటి నుండి బత్యం అంటే బియ్యం కూరగాయలు దానికి కావలసిన సామాన్లు అన్ని వసులు చేసి గుడివద్ద ఉదయాన్నే వంటలు వండుతారు మద్యాహ్నం సమయంలో గుడిలో భజనలు చేసి దేవునికి సమర్పించిన తర్వాత గ్రామంలో ఉన్న పెద్దలు మహిళలు పిల్లలు అందరు కలిసి బోజనాలు చేస్తారు. ఈరోజు ఇంటివద్ద ఎవ్వరు వంటలు వండుకోరు అందరు గుడి దగ్గరకి రావల్సిందే అన్న దానం తర్వాత సాయంత్రం దేవుని ఊరేగింపు చేస్తారు దీనితో సంక్రాతి పండుగ ముగుస్తుంది అని గ్రామ పెద్దలు తెలిపారు.ఇది మా గ్రామంలో పూర్వకాలం నుండి వస్తున్న ఆచారం అని తెలిపారు.

# తల్లి అంత్యక్రియల్లో పాల్గొననున్న ఇన్నయ్య

## తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన కోర్టు



జనగామ,**జనవరి 16ప్రజావినికిడి** యూపీఏ చట్టం కింద ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఆయనకు షరతులతో కూడిన 48 గంటల తాత్కాలిక బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. గాదె ఇన్నయ్య తల్లి థెరీసా (93) గురువారం రాత్రి మరణించారు. ఈ నేపథ్యంలో ఆయనకు కోర్టు ఈ బెయిల్ మంజూరు చేసింది. శనివారం జనగామ జిల్లాలోని జాఫర్‌గఢ్ మండలం సాగరంలో ఆయన తల్లి అంత్యక్రియలు జరగనున్నాయి. అందులో గాదె ఇన్నయ్య పాల్గొనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత కాటా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ మరణించారు. ఆయన అంత్యక్రియలకు మావోయిస్టు మాజీ నేత గాదె ఇన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు అనుకూలంగా ఆయన వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజలను.. ప్రేరేపించారే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉపా చట్టం కింద ఆయనపై ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. ఆ క్రమంలో డిసెంబర్ 21న ఇన్నయ్యను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడే ఉన్నారు. మంగళవారం జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో గాదె ఇన్నయ్య నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం విదితమే.

## చనాకా-కొరాటా పంప్‌హౌస్‌ను ప్రారంభించిన సిఎం

### నల్లమల సాగర్‌కు తాము వ్యతిరేకమన్న ఉత్తమ్

నిర్మల్,జనవరి16:



ఆదిలాబాద్ జిల్లాలో సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటించిన సందర్భంగా భోరాజ్ మండలం హతిఘాట్‌లో చనాకా–కొరాటా పంప్‌హౌస్‌ను ప్రారంభించి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో సిఎంతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అనంతరం నిర్మల్ జిల్లాలో సిఎం పర్యటించారు. పొంకల్ గ్రామంలో సదర్మట్ బ్యారేజీని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ చేపట్టిన నల్లమల సాగర్ కు తాము వ్యతిరేకమని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిస్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో దీనిపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. గోదావరి జలాల్లో చుక్క నీరు కూడా వదులుకునేది లేదని అన్నారు. నిర్మల్ లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన మంత్రి.. తుమ్మిడిహట్టి నుంచి గ్రావీటి ద్వారా సుందిళ్ల ప్రాజెక్టుకు తరలిస్తామని చెప్పారు. సుందిళ్ల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చెనాక కోరాట బ్యారేజి కోసం మరో వంద కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు- మంత్రి ఉత్తమ్. చెనాక కోరాట బ్యారేజికి మాజీ మంత్రి రామచంద్రా రెడ్డి పేరు , సదర్ మఠ్‌కు పి.నర్సారెడ్డి పేర్లు పెడుతున్నట్లు చెప్పారు. పీపీ ప్రాజెక్టు, మత్తడి, కుప్టి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. 27 ప్యాకేజీలకు రూ.97 కోట్లతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

## కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కొత్తకోట,జనవరి16: కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన శుక్రవారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో జరిగింది. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డులో కొండపై నుండి కిందకు దిగుతున్న కారు ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమయ్యింది. అయితే పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఘాట్ రోడ్డుపై సూచిక బోర్డులు లేకపోవడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

---------------

## తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చోరీలు

### ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు



అనంతపురం,జనవరి16: తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేసినట్లు శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండ డిఎస్పి తెలిపారు. డియస్పి నరసింగప్ప తెలిపిన వివరాల మేరకు.. సోమందేపల్లి పెనుకొండ, గోరంట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని ఈ దొంగలు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. చోరీ కేసులు నమోదు చేసి ప్రత్యేక పోలీసులు బృందం దర్యాప్తు చేపట్టిందన్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అనంతపురం కు చెందిన కోటయ్య, శాలి అనే ఇద్దరు వ్యక్తులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మూడు మండలాల్లో చేసిన వరుసు చోరీలకు పాల్పడింది వారేనని గుర్తించారు. 8 ఇళ్లలో దొంగతనాలం చేసింది ఈ ఇద్దరే అని పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన వారి నుంచి రూ.30 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. అనంతరం నిందితులను పెనుకొండ కోర్టులో హాజరు పర్చారు. చోరీ కేసులను చేదించిన పోలీసులను డిఎస్పి అభినందించారు.

-------------

# రోడ్డుపై పారుతున్న మురుగు నీరు..

# పట్టించుకునే వారే కరువు..

### దుర్గంధంతో చింతకుంట తండా వాసుల నిత్యవేదన..

### నెల రోజులుగా ఇదే దుస్థితి.. -దుర్గంధంతో సతమతం.. -ఈగలు,దోమలతో పరేషాన్..





**ప్రజావినికిడి,(జిల్లెడ్ చౌదరిగూడెం):** మండల పరిధిలోని చింతకుంట తండాలో మురుగునీరు ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతూ బురదమయంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. నెలరోజులుగా రహదారి అంతా మురుగు నీటి నిల్వలతో నిండిపోవడంతో వాహనదారులు, పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొంది. ఈ నీటి నిల్వల కారణంగా దోమలు విపరీతంగా పెరిగి,జ్వరాలు,చర్మవ్యాధులు,శ్వాసకోశ సంబంధిత సమస్యలు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటి దుర్గంధంతో ఇళ్లలో ఉండలేని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. గ్రామంలో నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ పాలకవర్గం సభ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.పలు మార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో ప్రజల సహనం కోల్పోయిందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు,గ్రామ పాలకవర్గం స్పందించి మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని చింతకుంట తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# శారీరక ఆరోగ్యం క్రమశిక్షణ క్రీడాలతోనే సాధ్యం

### ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి - ముగిసిన ఎంపియల్ ప్రీమియర్ లీగ్ సీజన్-10

### క్రీడాకారులకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**ప్రజావినికిడి,(నందిగామ):** క్రీడలు శరీరాన్ని దృఢంగా ఉంచడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచుతాయని అనేక జబ్బులను దూరం చేస్తాయని,క్రీడాకారులలో క్రమశిక్షణ నైతిక విలువలను పెంపొందించడానికి దోహదపడతాయని ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.నందిగామ మండలంలోని మామిడిపల్లి గ్రామంలో నిర్వహించిన ఎంపియల్ లీగ్ సీజన్ 10 ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.విన్నర్ గా మొదల్లగుడ టీం అదేవిధంగా రన్నర్ గా మజీద్ మామిడిపల్లి టీంలు నిలిచాయి.ఈ కార్యక్రమంలో

మామిడిపల్లి సర్పంచ్ మోత్కూరి హనుమంత్ రెడ్డి,వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు,మామిడిపల్లి ఉపసర్పంచ్ మామిలపల్లి రాజు,మామిడిపల్లి మాజీ సర్పంచ్ కవిత శ్రీనివాస్,వీర్లపల్లి మాజీ సర్పంచ్ సుధాకర్ గౌడ్,బీఆర్ఎస్ నాయకులు రఘుపతి రెడ్డి,సత్య సత్యనారాయణ,వెంకటేశ్వర్ రెడ్డి,సంగయ్య గౌడ్,వార్డు మెంబెర్స్ సమీరాఅశ్రఫ్,ప్రభు, ఆలూరి శ్రీపాల్ రెడ్డి,శ్రీకాంత్,ఉషామహేశ్వర్ రెడ్డి,ప్రభాకర్, అనిత అశోక్,మమత కిరణ్ గౌడ్,గ్రామ పెద్దలు,ఆర్గనైసర్స్,యువ నాయకులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వైబవంగా కొత్తకొండ వీరభద్రస్వామి ఉత్సవాలు

### భారీగా తరలివచ్చిన భక్తజనం -బండ్లు కట్టి స్వామిని దర్శించుకున్న ప్రజలు -పలువురు మంత్రులు రాక..భారీ బందోబస్తు ఏర్పాటు

హన్మకొండ,**జనవరి 16ప్రజావినికిడి**

:హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురు, శుక్రవారాల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. కోరిన కోరికలు తీర్చాలని స్వామివారికి కోర మీసాలు సమర్పించుకున్నారు. తమ గండాలు తొలగిపోవాలని గండా దీపంలో నూనె పోశారు. వీరభద్రుని సన్నిధిలో కోడె ప్రదక్షిణ చేశారు. గుమ్మడికాయ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూ కట్టారు. భక్తులు అధికం కావడంతో శీఘ్ర దర్శనం, విఐపి క్యూలైన్లు సైతం కిక్కిరిసిపోయాయి. జాతరలోని దుకాణాలు, రంగులరాట్నం, సర్కస్ తదితర షాపులన్నీ రద్దీగా మారాయి. జాతరలో భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు వాటిల్లకుండా ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు పూర్తి సదుపాయాలు కల్పించారు. మకర సంక్రాంతి పర్వదినం

గురువారం అర్ధరాత్రి ఆనవాయితీ ప్రకారం వరంగల్ జిల్లా వేలేరు కు చెందిన యాదవులు డబ్బు చప్పుళ్ళు, శివసత్తులు నృత్యాల మధ్య మేకల బండితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఎడ్లబండ్లతో వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి మొక్కులు



చెల్లించుకున్నారు. స్వామివారి గుట్టపైన కొలువుదీరిన వీరభద్ర స్వామి ఆత్మలింగం ఆలయంలో దివ్యాలంకరణ పూజలు జరిగాయి. గుట్టపైకి వెళ్ళిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపైకి వెళ్లి ప్రకృతి రమణీయతను వీక్షించేందుకు యువత పోటీపడ్డారు. మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు స్వగ్రామం వంగర లోని అతని ఇంటి నుంచి కొత్త కొండకు ఎడ్ల బండి రథం మకర సంక్రాంతి రోజున వెళ్లడం అనవాయతీగా వస్తుంది. ఈ ఏడాది సైతం ఎడ్ల బండి రథాన్ని అందంగా అలంకరించారు. శివ సత్తుల నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ ఎడ్ల బండి రథాన్ని కొత్తకొండకు గ్రామస్తులు అంగరంగ వైభవంగా సాగనంపారు. బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి అనే చందంగా కొత్తపల్లి నుంచి కొత్తకొండకు వెళ్లిన ఎడ్లబండ్లు రథాలను తలపించాయి. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది సైతం సుమారు 72 వరకు ఎడ్లబండ్లను బంతిపూలతో వివిధ రంగులతో అందంగా అలంకరించి రథాలుగాతీర్చిదిద్దారు. కొత్తకొండ వరకు సాగిన ఎడ్ల బండి రథాలను తిలకించేందుకు ప్రజలు దారి వెంట బారులు తీరారు. హిందూ, ముస్లిం అనే భేదం లేకుండా ఎడ్ల బండ్లతో వచ్చి ఆలయ ప్రదక్షిణలు చేసి మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు.

మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మకర సంక్రాంతి పర్వదినాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకున్నారు.



ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఈవో కిషన్ రావు వారికి శేష వస్త్రాలు సమర్పించి స్వామి వారి మెమొంటోను ప్రధానం చేశారు. అంతకుముందు త్రిశూల చౌరస్తాను ప్రారంభించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్తకొండ ఆలయ అభివృద్ధిలో భాగంగా మాడ వీధులు, ఇతరత్ర అభివృద్ధి పనులకోసం రూ. 70 కోట్లు నిధులు మంజూరు చేసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండి మందులు పంపిణీ చేశారు. అత్యవసర పరిస్థితి దృష్ట్యా అంబులెన్స్ ను అందుబాటులో ఉంచారు. దీంతోపాటు జాతరలో అగ్నిమాపక సిబ్బంది సైతం అందుబాటులో ఉన్నారు. జాతర లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. జూదం, మట్కా, గుట్కా, నాటుసారా లేకుండా పూర్తిస్థాయిలో పోలీసులు నియంత్రించారు. కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి తో పాటు మరో ఇద్దరు ఏసీపీలు పదిమంది సీఐలు, 25 మంది ఎస్సైలు, 350 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొని సేవలందించారు.

# నోట్ల కట్టల కేసులో జస్టిస్ యశ్వంత్‌వర్మకు చుక్కెదురు

## దర్యాప్తు చట్టబద్ధతపై సవాల్‌ను తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ,జనవరి16: నోట్ల కట్టల కేసులో న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. తనను తొలగించాలని కోరుతూ వచ్చిన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఆమోదించడంతోపాటు తనపై దర్యాప్తు కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ ప్యానల్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసుకు సంబంధించిన తీర్పును జనవరి 8న రిజర్వ్ చేసిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మలతో కూడిన ధర్మాసనం నేడు వెలువరించింది.గతేడాది జస్టిస్ యశ్వంత్‌వర్మ దిల్లీ హైకోర్టులో సేవలందిస్తున్నప్పుడు తన అధికారిక నివాసంలో పెద్దఎత్తున నోట్లకట్టలు లభ్యమయ్యాయి. దానిపై అంతర్గత త్రిసభ్య సంఘం విచారణ జరిపింది. అది ఇచ్చిన నివేదిక నేపథ్యంలో పదవి నుంచి వైదొలగాల్సిందిగా సుప్రీంకోర్టు సూచించింది. ఆయన దానికి అంగీకరించకపోవడంతో పార్లమెంటులో అభిశంసనకు ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లిన జస్టిస్ వర్మకు అక్కడ మళ్లీ చుక్కెదురైంది.



---------

# భజెపి అధ్యక్ష ఎన్నికకకు రంగం సిద్ధం

## 19న నామినేషన్..20 ఎన్నికల ప్రక్రియ

న్యూఢిల్లీ,జనవరి16: భారతీయ జనతా పార్టీకి మరికొన్ని రోజుల్లో కొత్త సారథి రానున్నారు. పార్టీ నూతన అధ్యక్షుడి కోసం ఎన్నిక తేదీని భాజపా శుక్రవారం ప్రకటించింది. ఈ పదవికి జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నట్లు తెలిపింది. ఆ మరుసటి రోజు జనవరి 20న కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు భాజపా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 19వ తేదీ మధ్యాహ్నం 2-4 గంటల మధ్య అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించవచ్చని లక్ష్మణ్ తెలిపారు. ఆ తర్వాత నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. అదేరోజు సాయంత్రం 5-6 గంటల మధ్య నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నిక అవసరమైతే జనవరి 20న పోలింగ్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామన్నారు. ఈ పక్రియంతా భాజపా ప్రధాన కార్యాలయంలో జరగనుంది. కాగా.. ఇటీవల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన 45 ఏళ్ల నితిన్ నబీన్ నే పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువనాయకత్వాన్ని తయారుచేసుకోవడడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య పగ్గాలు అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. బిహార్‌కు చెందిన నితిన్ నబీన్ సిన్హాను భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ గుర్తింపు సాధించారు.



# కారు అద్దాలు పగలగొట్టి దూసుకొచ్చిన జంతువు


## తల్లి ఒడిలో నిద్రిస్తున్న నాలుగేళ్ల చిన్నారి మృతి

భోపాల్,జనవరి16: మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ కుటుంబం కారులో వెళ్తుండగా.. అడవి జంతువు ఉన్నట్టుండి కారులోకి దూసుకురావడంతో ముందు సీట్లో తల్లి ఒడిలో కూర్చున్న నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుణ ప్రాంతానికి చెందిన సోను జాట్ అనే వ్యక్తి సంక్రాంతి పండగను జరుపుకోవడానికి తన భార్య, నాలుగేళ్ల కుమార్తె తాన్యతో కలిసి బుధవారం వారి స్వగ్రామానికి బయల్దేరాడు. బైపాస్‌లోని దోఖంభా ప్రాంతంలో వారు కారులో వెళ్తుండగా.. రెండు నీల్‌గాయ్ జంతువులు అకస్మాత్తుగా రోడ్డు పైకి వచ్చాయి. సోను అప్రమత్తమయ్యేలోపు ఆ జంతువుల్లో ఒకటి కారు అద్దం పగలగొట్టుకుని లోపలికి దూసుకువచ్చింది. దీంతో ముందు సీటులో తల్లి ఒడిలో కూర్చున్న నాలుగేళ్ల తాన్య తలకు జంతువు కాళ్లు బలంగా తాకడంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కారులో చిక్కుకున్న నీల్‌గాయ్‌ను బయటకు తీసి, చికిత్స అందిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.



# దీపికకు అరుదైన గౌరవం

## అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికకు రాష్ట్రపతి ప్రత్యేక ఆహ్వానం



**శ్రీ సత్యసాయి ప్రతినిధి, జనవరి 16ప్రజావినికిడి :** శ్రీ సత్యసాయి జిల్లా మడకశిరకు చెందిన భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికకు అరుదైన గౌరవం దక్కింది. న్యూఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకలకు హాజరు కావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమెకు అధికారికంగా ఆహ్వానం పంపారు.అంధుల క్రికెట్‌లో తన అద్భుత ప్రదర్శనతో దేశానికి గర్వకారణంగా నిలిచిన దీపిక, యువతకు ప్రేరణగా నిలిచారు.కష్టాలను జయించి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ఆమె సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ గౌరవాన్ని అందించింది.ఈ ఆహ్వానం శ్రీ సత్యసాయి జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణంగా మారింది.దీపిక సాధించిన విజయం ప్రత్యేక ప్రతిభకు, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది.

# గిరిజనులతో కలసి ఆడిపాడిన హోంమంత్రి అనిత

**కుటుంబ సభ్యుతలతో కలసి గ్రామం సందర్శన**

**వారి యోగక్షేములు తెలుసుకుని కలసి భోజనం**

**మంత్రి రాకతో ఆనందం వ్యక్తం చేసిన గ్రామస్థులు**





అనకాపల్లి,**జనవరి 16ప్రజావినికిడి**

గిరిజన గ్రామంలో కుటుంబ సభ్యులతో కలసి పర్యటించిన మంత్రి అనిత అక్కడి వరితో కలసి ఆడిపాడారు. వారితో కలసి భోజనం చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కోటవురట్ల మండలం గొట్టివాడ శివారులో ఉన్న మారుమూల గిరిజన గ్రామం అణుకులో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన మంత్రి.. గిరిజనులతో కలిసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కనుమ పండగ సందర్భంగా గిరిపుత్రులతో ఎంతో సంతోషంగా గడిపారు. గ్రామస్థులు మంత్రి అనితను 'అనితమ్మ.. మా గుండె' అంటూ కొనియాడారు. 'అనితమ్మ రావడం మాకు పెద్ద పండుగ' అని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎన్నో ప్రాణాలు కోల్పోయినట్లు గిరిజనులు గుర్తుచేశారు. ఇప్పుడు రోడ్డు మంజూరు చేయించినందుకు మంత్రి అనితకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలోని పరిదేశమ్మ తల్లి ఆలయాన్ని మంత్రి అనిత దర్శించుకున్నారు. గిరిజనులతో ముఖాముఖి సంభాషణ జరిపి, వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. అక్కడి ప్రజలను పేరుపేరునా పలకరించి వారి యోగక్షేమాలు అడిగారు. చిన్నారులతో ఆడుకుని.. వారికి పుస్తకాలు, గిరిజనులకు సంక్రాంతి కానుకలు అందజేశారు. గిరిజనులకు స్వయంగా భోజనాలు వడ్డించి, తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. మంత్రి కుమారుడు నిఖిల్.. అణుకు యువకులకు క్రికెట్ కిట్లు, స్పోర్ట్స్ టీషర్టులు అందజేశారు. మంత్రి అనిత, కుమారుడు నిఖిల్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆ గ్రామ యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం.. చిన్నారుల డ్యాన్స్‌ను అభినందించారు. గిరిజనులు పండించిన కూరగాయలు, పంటలను మంత్రికి అణుకు ప్రజలు బహూకరించారు. గ్రామస్థులతో మాట్లాడిన మంత్రి అనిత మాట్లాడుతూ.. 'మీతో ప్రశాంతంగా పండుగ చేసుకోవాలని ఇక్కడకు వచ్చాను. మీ అందరితో కలిసి పండుగ చేసుకోవడం నా పూర్వజన్మ సుకృతం. నా పిల్లలను కూడా తీసుకువచ్చాను. మీ గ్రామానికి ఏమి కావాలో అన్నీ చేస్తాను. రూ. 2.50 కోట్లతో రోడ్డు మంజూరైంది. సంబంధిత ఆర్డర్ కాపీతోనే వచ్చాను. మీరంతా సంతోషంగా ఉండాలి. పిల్లలు చక్కగా చదువుకోవాలి. మంచి ఉద్యోగాలు చేయాలి' అని హోంమంత్రి చెప్పారు. 2014 నుంచి 2019 వరకు ఈ గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు రేషన్ డిపో ఏర్పాటు చేస్తున్నామని అనిత అన్నారు. త్వరలో సెల్ టవర్ స్థాపన చేస్తామని తెలిపారు. గ్రామంలో 20 మంది పిల్లలు ఇంటర్, డిగ్రీ వరకు చదివారన్న ఆమె.. ఇద్దరు ఆడపిల్లలు డిగ్రీ చదువుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా.. అణుకు గ్రామంలో ఒక్కో ఇంటికి ఒక బాత్‌రూమ్ నిర్మాణం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

**వైభవంగా సంక్రాతి ప్రభల ఉత్సవం**

**భారీగా హాజరైన జిల్లా ప్రజలు**

**పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు**



**కోనసీమ,జనవరి 16ప్రజావినికిడి**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి ప్రభల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 476 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని వీక్షించేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. జిల్లాలోని అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం గ్రామీణ మండలాలకు చెందిన 11 ఏకాదశరుద్ర ప్రభలను ఇక్కడికి తీసుకొస్తున్నారు. గ్రామాల్లో ముహూర్తం నిర్ణయించి ఊరేగించారు. జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిన విషయం తెలిసిందే. ఏటా కనుమ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రభలను కొలువుదీర్చుతారు. అక్కడ భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆయా గ్రామాలకు తరలివెళతాయి. వీటిల్లో టన్నులకొద్దీ బరువుండే గంగలకుర్రు, అగ్రహారం ప్రభలను స్థానిక ఎగువకౌశిక నదిని దాటించి యువకులు భుజాలపై మోసుకుని జగ్గన్నతోటకు తీసుకొస్తారు. ఈ సన్నివేశాన్ని చూసేందుకు జనం తరలివస్తారు. మిగతా వాటిని రోడ్డు మార్గంలో తీసుకొస్తారు. ఈ ఉత్సవం బందోబస్తులో 300కు పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసారు. ఈ ఉత్సవం కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ సంప్రదాయ ఉత్సవంలో ఏకాదశ రుద్రుల ప్రభలు 11 గ్రామాల నుంచి ఊరేగింపుగా జగ్గన్నతోటకు తరలిరానున్నాయి. వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, ఇరుసుమండ, వక్కలంక వంటి గ్రామాల నుంచి కూడా ప్రభలు ఊరేగింపుగా వచ్చాయి. లక్షలాది మంది భక్తులు, పర్యాటకులు తరలి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం, స్థానిక అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జగ్గన్నతోటకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. వాహనాల దారి మళ్లింపు చేపట్టారు. భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే ప్రభల ఉత్సవంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వైద్య సిబ్బందిని కూడా ఉంచారు. ప్రభుత్వం ఇచ్చిన రాష్ట్ర పండుగ హోదాతో జగ్గన్నపేట ప్రభల ఉత్సవం ఇకపై ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

# తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్

## రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో అభివృద్ధి -క్యాంపు కార్యాలయంలో అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి**జనవరి 16ప్రజావినికిడి**

తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో ఈ కేంద్రం ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా, వారికి అన్ని విధాలా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ మేరకు భవిష్యత్తులో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు.. ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని సీఎం తెలిపారు. వివిధ రంగాల్లో కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూరిటీ, సెమీ కండక్టర్ల డివైజెస్-సెన్సర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, రూరల్ ఏరియా టెక్నాలజీ వంటి రంగాలు భవిష్యత్తులో కీలకం కానున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగా పాలసీలు రూపొందిస్తోందని వివరించారు. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలను ప్రోత్సహిస్తోందని సీఎం తెలిపారు. దేశంలో తొలిసారిగా గ్రీన్ ఎనర్జీ రంగంలో.. గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ తరహాలో కొత్త ఆవిష్కరణలకు.. వివిధ స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రం వేదికగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు భవిష్యత్తులో డిమాండ్ ఉన్న రంగాలకు పెద్దపీట వేయడమే కాకుండా.. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి అతి పెద్ద రీసెర్చ్ కేంద్రం అవసరమన్న సీఎం.. తిరుపతిలో ఏర్పాటు చేసే ఏపీ-ఫస్ట్ వ్యవస్థ ఆ అవసరాలను తీర్చేలా ఉండాలన్నారు. రాష్ట్రంలోని యువతకు సహకరించేలా పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. తిరుపతిలోని ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ రెండు ప్రముఖ జాతీయ విద్యా సంస్థల కాంబినేషన్లో ఏపీ ఫస్ట్ ఏర్పాటు కానుందన్న చంద్రబాబు.. దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలని స్పష్టంచేశారు. ఏపీ ఫస్ట్ వ్యవస్థను సమర్ధవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరపాలని సూచించారు.



# రాష్ట్రాల పురోగతి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు !

**జనవరి 16ప్రజావినికిడి**
మరో పక్షం రోజుల్లో కేంద్ర బడ్జెట్ ప్రకటించనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు బడ్జెట్ కసరత్తులో బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించారు. ఆయా రాష్ట్రాల మంత్రులు వారివారి రాష్ట్రాల్లో ఉన్న అవసరాలను, నిధుల కేటాయింపులపై వినతిపత్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భట్టి విక్రమార్క, పయ్యావుల కేశవుల హాజరై తమ అసవరాలను, ఆకాంక్షలను వెల్లడంచారు. అయితే ఏటా కేటాయింపులు చేస్తున్నా..ఇప్పటి వరకు ప్రకటించిన కేటాయింపులు, ఖర్చులపై స్పష్టత లేదు. ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారో తెలియదు. అలాగే అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ కేటాయింపులు ఉండాలి. బడ్జెట్ అంటే అభివృద్ధి దివఫూ చర్యలు ఉండాలి. అనుకూల రాష్ట్రాలకు ఒక రకంగా, తమ పార్టీ పాలనలో లేని రాష్ట్రాలను మరో రకంగా చూసే విధానాలకు పాతరేయాలి. బడ్జెట్ అందరికి సమాన హక్కుగా ఉండాలి. అది దేశ ప్రగతిని ప్రతిఫలించాలి. తమకు మద్దు ఇస్తున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక రకంగా, మిగతా రాష్ట్రాలను మరో రకంగా చూసు విధానం సరికాదు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్య స్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ రాష్ట్రాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జిఎస్‌టి పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలూ విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం. సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బిజెపి తెగబడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా మనో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. త్వరలో ఎన్నికలు జరగనున్నఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక



దిగ్బంధనంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పక పోవడం పచ్చి అవకాశవాద రాజకీయం తప్ప మరోటి కాదు. ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ తరహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది. బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి. స్థిరమైన ఆర్థిక వనరులతోనే బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశంపైనే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయా

దాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రం తరపున పాల్గొన్న తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అనేక విషయాలను నిర్మలా సీతారామన్ ముందుంచారు. ఫ్యూచర్ సిటీ, నవోదయలు, మూసీ సుందరీకరణ, రోడ్ల విస్తరణ, ఎస్సీఆరెస్పీకి జాతీయ హోదా ,ట్రిపుల్ ఆర్ వంటి అనేక అంశాలను, నిధుల కేటాయింపులను ప్రస్తావించారు. వీటికి కేంద్రం బ్డజెట్‌లో ఏ రకమైన స్పందన చూపిస్తుందో చూడాలి. అలాగే ఎపికి చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ కూడా కోరికల చిట్టా విప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులకు సాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. విభజన హామీల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం అదనపు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ కోరికలు కోరడం ఇదే మొదటి సారికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ దాదాపుగా ఇవే అంశాలను ప్రధాన మంత్రి నుండి మంత్రుల వరకు వ్యక్తిగతంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, పర్యటనలకు వెళ్లే మంత్రులూ ఇదే పనిమీద ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయినా, కేంద్రం నుండి నిధులు రావడం లేదు. మన రాష్ట్రమే కాదు, ఎన్‌డిఎలో మరో భాగస్వామిగాఉన్న బీహార్ ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి విజ్ఞప్తులే అందాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిఎస్‌టి నష్టపరిహారం, గ్రాంట్ల పెంపు, ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి. నిధుల కేటాయింపుల్లో సమతుల్యత పాటించాలి. విభేదాలు పక్కన పెట్టాలి. అప్పుడే కేంద్ర, రాష్ట్రాల మధ్య సయోధ్య సాధ్యం అవుతుంది.

# చట్టవిరుద్ధంగా వాకీటాకీల విక్రయం

**అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు సంస్థలకు షాక్ -ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై రూ.44లక్షల వరకు జరిమానా**

న్యూఢిల్లీ,**జనవరి 16ప్రజావినికిడి**
చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ-కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ-కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0-446.2 బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి




దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్ , అమెజాన్ , మీషో , జియో మార్ట్ తదితర ఈ-కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లు అఅఖం తెలిపింది. లైసెన్స్ మినహాయింపు ఫ్రీక్వెన్సీ రేంజ్ దాటి ఉన్న వాకీ టాకీలను ఈ కంపెనీలు విక్రయించినట్లు పేర్కొంది. ఇందుకు గానూ మీషో, మెటా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలకు రూ.10లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు రూ.లక్ష చొప్పున ÷న్ వేసింది. వీటిలో మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో ఇప్పటికే పెనాల్టీలు చెల్లించినట్లు సీసీపీఏ వెల్లడించింది.

# సంక్రాంతి సెలవుల ముగింపు

**తిరుగు ప్రయాణాలకు సన్నాహాలు -ట్రాఫిక్ జామ్ లేకుండా వాహనాల మళ్లింపు**

నల్లగొండ,**జనవరి 16ప్రజావినికిడి**
సంక్రాంతి సంబురాల ముగింపుతో పల్లెలకు వెళ్లిన వారు ఇళ్లకు చేరే సమయం ఆసన్నమైంది. శని, ఆదివారాల్లో నగరాలకు బయలుదేరనున్నారు. ఈ క్రమంలో రోడ్లు జామ్ కాకుండా, ట్రాఫిక్ చిక్కులు ఏర్పడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు మళ్లీ పట్నం బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - విజయవాడ హైవేపై రద్దీని తగ్గించేందుకు నల్గొండ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు.హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల, పెద్ద కాపర్తి వద్ద ÷÷-లఓల్గ÷వర్ నిర్మాణ పనులు జరుగుతుండటతంతో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉన్నందున దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.



ప్రయాణికులు, వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.దారి మళ్లింపు వివరాలు ఇలావున్నామి. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను గుంటూరు, మిర్యాలగూడ, హాలియా, కొండమల్లేపల్లి,చింతపల్లి,మాల్ మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలలను మాచర్ల,నాగార్జునసాగర్, పెద్దవూర,కొండపల్లేపల్లి, చింతపల్లి-మాల్ మీదుగా హైదరాబాద్ మళ్లిస్తారు. నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను నల్లగొండ,మాడ్రిగూడ బై పాస్ -మునుగోడు , నారాయణపూర్- చౌటుప్పల్ (ఎన్.హెచ్ 65)మీదుగా హైదరాబాద్ తరలిస్తారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలను కోదాడ-హుజూర్‌నగర్-మిర్యాలగూడ-హాలియా-చింతపల్లి-మాల్ మీదుగా హైదరాబాద్ మళ్లించారు. ఎన్.హెచ్ 65 విజయవాడ -హైదరాబాద్ రహదారి పై చిట్యాల,పెద్దకాపర్తిలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు జరుగుతున్నందున ట్రాఫిక్ జామ్ అయిన పక్షంలో చిట్యాల నుంచి భువనగిరి గుండా హైద్రాబాద్ మళ్లించడం జరుగుతుంది.ఈ మార్గాల ద్వారా వెళ్లడం వల్ల ప్రధాన రహదారి విజయవాడ, హైద్రాబాద్ పై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, ప్రయాణికులు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవచ్చని పోలీసులు తెలిపారు.

# తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

**పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించిన మంత్రి జూపల్లి**

హైదరాబాద్,**జనవరి 16ప్రజావినికిడి**
:తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ వేదికగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఈ షో జరుగనుంది. తెలంగాణ పర్యాటక, సంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ హాట్ ఎయిర్ బెలూన్ షోను ప్రారంభించారు. ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న 300 మంది సందర్శకులకు హాట్ ఎయిర్ బెలూన్లలో రైడ్‌కు అనుమతి ఇవ్వనున్నారు. అలాగే సాధారణ ప్రేక్షకులకు నైట్ గ్లో షో ఓపెన్‌గా ఉండనుంది. హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. వయస్సు, రైడ్ రకాన్ని బట్టి ధరలు రూ.500




నుంచి రూ.1500 వరకు ఉండనున్నాయి. ఃూగా.. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సందర్భంగా జనవరి 13 నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్ / స్వీట్స్ ఫెస్టివల్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. పెద్ద సంఖ్యలో సందర్శకులు కైట్ ఫెస్టివల్‌లో పాలుపంచుకున్నారు. అలాగే జనవరి 16, 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాద్‌లో తొలి హాట్ ఎయిర్ బెలూన్ ఈవెంట్‌గా రికార్డు సృష్టిస్తోంది. పరేడ్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రంగురంగుల బెలూన్లు ఆకాశంలో కనువిందు చేయనున్నాయి.

# నీరవ్ మోడీ కేసులో ఈడి దర్యాప్తు

**ఛోక్సీ తనయుడు రోహన్‌కు కూడా సంబధం**

**ఢిల్లీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు ఇడి వివరాలు**

న్యూఢిల్లీ,**జనవరి 16ప్రజావినికిడి**
పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీ కేసుపై ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు తాజాగా కీలక విషయం వెల్లడించారు. ఈ మనీలాండరింగ్ కేసులో మెహుల్ ఛోక్సీ కుమారుడు రోహన్



చోక్సీకి కూడా సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు దిల్లీలోని అప్పీలేట్ ట్రెబ్యునల్‌కు వివరాలు వెల్లడించారు. మెహుల్ చోక్సీ డైరెక్టర్‌గా ఉన్న లస్టర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో రోహన్ చోక్సీకి 99.99 శాతం వాటా ఉందని.. ఈ కంపెనీ నిధులను వారు విదేశాలకు మళ్లించడానికి ఉపయోగించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నగదు అక్రమ చలామణిలో రోహన్ చోక్సీ చురుకుగా పాల్గొన్నట్లు తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. దీంతో అతడి ఆస్తులను అటాచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రోహన్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులను కూడా విచారించడానికి ఈడీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా.. నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ప్రస్తుతం నీరవ్ లండన్‌లోని జైల్లో ఉన్నాడు. వారిని భారత్‌కు తీసుకురావడానికి విదేశాంగ అధికారులు ఆయా దేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నారు.

# మరోమారు పాక్ కవ్వింపు చర్యలు


**సరిహద్దుల్లో డ్రోన్లతో దాడి చేసే యత్నం**

న్యూఢిల్లీ,**జనవరి 16ప్రజావినికిడి**
ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తాం అంటూనే.. పాకిస్థాన్ మరోవైపు కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సైన్యం స్పందించి యాంటీ-డ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం మూడోసారి అంటున్నారు. పాకిస్థాన్‌కు భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం వేడుకల నేపథ్యంలో సరిహద్దుల్లో భద్రతా దళాలు పహారా కాస్తున్నాయి. డ్రోన్ల కదలికల తర్వాత ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం రాత్రి, రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ (ఒక్షఅ) దాటి భారత భూభాగంలోకి వచ్చిన అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

# వైట్‌హైజ్‌లో ట్రంప్‌తో కొరినా మచాడో భేటీ

**తనకు దక్కిన నోబెల్ శాంతి బహుమతి ట్రంప్‌కు అందచేత**

వాషింగ్టన్,**జనవరి 16ప్రజావినికిడి**
వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో గురువారం వైట్ హౌజ్‌లో అధ్యక్షుడు ట్రంప్‌ని కలిశారు. ఈ సందర్భంగా తన నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని ట్రంప్ నకు అందజేశారు. సమావేశం అనంతరం ఈ విషయాన్ని మచాడో స్వయంగా మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా మచాడో మాట్లాడుతూ.. 'చరిత్రలో రెండు వందల ఏళ్ల తర్వాత, బొలివర్ వారసులు వాషింగ్టన్ వారసుడికి ఒక పతకాన్ని తిరిగి ఇస్తున్నా.. ఇది మన స్వేచ్ఛ పట్ల ఆయన ప్రత్యేక నిబద్ధతకు గుర్తింపుగా నా నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్ నకు అందజేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో,



ఆయన భార్యను ఇటీవల అమెరికా సైనిక దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఈ పరిణామాలు చోటు చేసుకోవడం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మచాడోతో భేటీ అనంతరం ట్రంప్ స్పందిస్తూ.. 'మారియా కొరినా మచాడోను కలవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఆమె ఎన్నో కష్టనష్టాలను ఎదిరించి నిలిచిన గొప్ప మహిళ, ఇన్నాళ్ళు ప్రపంచ శాంతి కోసం నేను చేసిన కృషిని గుర్తించి ఆమె తన నోబెల్ పురస్కారాన్ని నాకు బహుమతిగా ఇచ్చారు.. థ్యాంక్యూ మరియా.. అంటూ తన ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. గత ఏడాది అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని.. దానికి తాను పూర్తి అర్హుడని నానా హంగామా చేశారు. కానీ, నోబెల్ బహుమతి మాత్రం ట్రంప్‌నకు దక్కలేదు. 2025 లో నోబెల్ బహుమతి వెనుజువెలా ప్రతిపక్ష నేత కొరినా మచాడోకి దక్కింది.

# ఖుషి ముఖర్జీపై పరువు నష్టం దావా

## సూర్యకుమార్ యాదవ్ పై ఖుషి ఆరోపణలు



చిత్ర విచిత్రమైన దుస్తులతో తరచుగా వార్తల్లో నిలిచే నటి ఖుషి ముఖర్జీ. సోషల్ మీడియాలో ఆమె పాపులర్. డ్రస్‌లు మాత్రమే కాదు, కొన్ని కామెంట్స్ చేయడం వల్ల కూడా తరచూ ఆమె హెడ్ లైన్స్‌లో నిలుస్తుంది. కొన్ని రోజుల క్రితం భారత క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు ఆ వ్యాఖ్యల కారణంగా చట్టపరమైన చిక్కుల్లో పడింది. ఇప్పుడీ నటిపై పరువు నష్టం దావా దాఖలైంది. ఖుషి ముఖర్జీ ఒక మీడియా ఇంటరాక్షన్‌లో మాట్లాడుతూ... భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తనకు సోషల్ మీడియాలో మెసేజ్ చేస్తాడని చెప్పింది. ఖుషి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆమె తీరు చర్చనీయాంశమైంది. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం... సూర్యకుమార్ యాదవ్ అభిమాని ఫైజాన్ అన్సారీ నటి ఖుషి ముఖర్జీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాడు. అందులో ఆమెపై రూ. 100 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఈ ఫిర్యాదును గాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. ఖుషి ముఖర్జీ ఇదంతా కేవలం పేరు కోసం చేస్తోందని ఫైజాన్ అంటున్నారు. ఖుషి చేసిన కామెంట్స్ చాలా బాధాకరమైనవని, అవి సూర్య కుమార్ యాదవ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తాయని, ఆమె కామెంట్స్ ఎటువంటి ఆధారాలు లేకుండా, ఎటువంటి చాట్‌లు చూపించకుండా చేశారని ఫైజాన్ చెప్పారు. కేవలం క్రికెటర్ ప్రతిష్టకు నష్టం కలిగించే నిరాధారమైన ఆరోపణ అని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి ఖుషి ముఖర్జీ "నేను ఏ క్రికెటర్‌తోనూ డేట్ చేయాలనుకోవడం లేదు. చాలా మంది క్రికెటర్లు నా వెనుక పడ్డారు. సూర్య కుమార్ యాదవ్ మొదట నాకు చాలా మెసేజ్‌లు పెట్టేవాడు. కానీ, ఇప్పుడు మేము పెద్దగా మాట్లాడుకోవడం లేదు. నేను ఎలాంటి సంబంధం కోరుకోవడం లేదు. నా పేరుతో ముడిపడి ఏవైనా లీక్‌లు రావడం నాకు ఇష్టం లేదు" అని చెప్పారు. ఆ తర్వాత ఆమెను చాలా మంది ట్రోల్ చేశారు కూడా.

# బౌలింగ్ వ్యూహం మారాల్సిందే



ఇండోర్: భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య నిర్ణాయక మూడో వన్డే ఆదివారం ఇక్కడ జరగనుంది. అయితే సిరీస్ చేజిక్కించుకోవాలని పట్టుదలగా ఉన్న టీమిండియా..తన బౌలింగ్ వ్యూహాలపై పునరాలోచన చేయాల్సి ఉంటుంది. తొలి రెండు వన్డేలలో భారత స్పిన్నర్లను న్యూజిలాండ్ బ్యాటర్లు అలవోకగా ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రత్యర్థి స్పిన్నర్ల బౌలింగ్‌లో పరుగులు రాబట్టడం మన బ్యాటర్లకు కష్టమైపోయింది. రాజ్‌కోట్‌లో జరిగిన రెండో వన్డేలో నెగ్గిన కివీస్ సిరీస్‌ను 1-1తో సమం చేసిన విషయం తెలిసిందే. మధ్య ఓవర్లలో భారత బౌలర్ల వైఫల్యం రాజ్‌కోట్‌లో మరోసారి కొట్టొచ్చినట్టు కనిపించింది. మిస్టరీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను న్యూజిలాండ్ ఆటగాళ్లు సులువుగా ఎదుర్కోవడం గమనార్హం. ఇక..బ్యాటర్లకు అనుకూలించే ఇండర్‌లో బౌండరీ విస్తీర్ణం కూడా తక్కువగా ఉంటుంది. ఈనేపథ్యంలో బౌలింగ్‌లో వైవిధ్యం కన్నా..క్రమశిక్షణగా బంతులు వేయడం ముఖ్యం. అందుకు వికెట్లను లక్ష్యంగా చేసుకొని కుల్దీప్ బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. గాయంతో వాషింగ్టన్ సుందర్ దూరం కావడం రాజ్‌కోట్ మ్యాచ్‌పై ఎంతో ప్రభావం చూపింది. అతడి స్థానంలో జట్టులోకి వచ్చిన నితీశ్ కుమార్ కేవలం రౌండు ఓవర్లే వేశాడు. ఇండోర్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే తుది జట్టులో ఆఫ్ స్పిన్నర్ ఆయుష్ బదోనికి స్థానం కల్పిస్తారేమో చూడాలి. పేస్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఎడమ చేతి వాటం బౌలర్ అర్ష్‌దీపీపను తీసుకునే అవకాశాలు లేకపోలేదు. అదే జరిగితే ప్రసిద్ధ్‌ను పక్కనపెట్టాల్సి ఉంటుంది. కాగా..

న్యూజిలాండ్‌తో మొదటి రెండు వన్డేలకు పేసర్ అర్షదీప్ ను పక్కపెట్టడంపై మాజీ స్పిన్నర్ అశ్విన్ భారత జట్టు యాజమాన్యాన్ని నిలదీశాడు. 'జట్టుకు ఎన్నో సేవలందించిన అర్ష్‌దీప్ తుది 11 మందిలో స్థానానికి పోరాటం చేయాల్సి రావడమా? ఒక మ్యాచ్ ఆడితే రెండో పోటీలో అతడికి చోటు దక్కడం లేదు. మీరు కారణాలు ఎన్ని చెప్పినా అది అతడి విశ్వాసాన్ని దెబ్బ తీస్తుంది. బౌలర్లకే అన్నిసార్లు ఎందుకిలా జరుగుతున్నది. బ్యాటర్లకు మాత్రం ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాదు' అని అశ్విన్ దుయ్యబట్టాడు.

# 6,6,6,6,6,6,6,6,6.. 14 బౌండరీలతో తుఫాన్ సెంచరీ

## • స్టీవ్ స్మిత్ తన విధ్వంసకర బ్యాటింగ్

బిగ్ బాష్ లీగ్ 37వ మ్యాచ్‌లో సిడ్నీ సిక్సర్స్, సిడ్నీ థండర్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన సిడ్నీ థండర్ నిర్ణీత 20 ఓవర్లలో భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 58 బంతుల్లోనే 110 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో థండర్ జట్టు 189 పరుగుల భారీ లక్ష్యాన్ని సిక్సర్స్ ముందు ఉంచింది. 42 బంతుల్లోనే సెంచరీ.. 190 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సిడ్నీ సిక్సర్స్‌కు స్టీవ్ స్మిత్ కనీవినీ ఎరుగని ఆరంభాన్ని ఇచ్చాడు. మొదటి బంతి నుంచే బౌలర్లపై విరుచుకుపడిన స్మిత్, కేవలం 42 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో స్మిత్ మొత్తం 5 ఫోర్లు, 9 భారీ సిక్సర్లు బాదాడు. అతని స్ట్రైక్ రేట్ 238.09 గా నమోదు కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో హైలైట్ ఏంటంటే.. స్మిత్ ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో ఏకంగా 32 పరుగులు పిండుకున్నాడు. ఆ ఓవర్‌లో వరుసగా 4 సిక్సర్లు బాదిన స్మిత్, ఆ తర్వాత ఫోర్ కొట్టాడు. నో బాల్, వైడ్ రూపంలో వచ్చిన పరుగులతో కలిపి ఆ ఓవర్ దీదీూ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఓవర్లలో ఒకటిగా నిలిచింది. మరోవైపు సిడ్నీ సిక్సర్స్ తరపున ఆడుతున్న పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం నిలకడగా ఆడినప్పటికీ, వేగంగా పరుగులు రాబట్టలేకపోయాడు. 39 బంతుల్లో 47 పరుగులు చేసిన బాబర్, నాథన్ మెక్‌ఆండ్రూ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. స్మిత్ సునామీ ముందు బాబర్ ఇన్నింగ్స్ వెలవెలబోయింది. స్మిత్ విధ్వంసంతో సిడ్నీ సిక్సర్స్ జట్టు మరో 16 బంతులు మిగిలి ఉండగానే 190 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో సిక్సర్స్ పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది. వార్నర్ సెంచరీ వృథా అయినప్పటికీ, స్మిత్ వీరబాదుడు ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.



# చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ!



అండర్ 19 వన్డే ప్రపంచకప్ 2026లో టీమిండియా శుభారంభం చేసింది. అమెరికాతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. అయితే ఈ మ్యాచ్ ద్వారా టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. భారత్ తరఫున అండర్ 19 ప్రపంచకప్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచాడు. 14 ఏళ్ల 294 రోజుల వయసులో వైభవ్ సూర్యవంశీ అండర్ 19 ప్రపంచకప్ బరిలోకి దిగాడు. ఈ క్రమంలో కుమార్ కుశాగ్ర రికార్డ్‌ను అధిగమించాడు. అతను 15 ఏళ్ల 88 రోజుల వయసులో అండర్ 19 ప్రపంచకప్ ఆడాడు. 2020లో జరిగిన టోర్నీలో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. తాజాగా ఈ రికార్డ్‌ను వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. అండర్ 19 ప్రపంచకప్‌లో వైభవ్ సూర్యవంశీ శుభారంభం అందుకోలేకపోయాడు. అమెరికాతో తొలి మ్యాచ్‌లో 4 బంతుల్లో 2 పరుగులు మాత్రమే చేసి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. సూర్య విఫలమైనా ఈ మ్యాచ్‌లో భారత్ గెలుపొందింది. అభిగ్యాన్ కుందు(41 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 42 నాటౌట్) భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన అమెరికా అండర్ 19 టీమ్ 35.2 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌటైంది. నితిష్ సుదిని(52 బంతుల్లో 4 ఫోర్లతో 36) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హెనిల్ పటేల్(5/16) ఐదు వికెట్లు తీయగా.. దిపేశ్ దేవంద్రన్, అంబ్రిష్, ఖిలాన్ పటేల్, వైభవ్ సూర్యవంశీ తలో వికెట్ తీసారు.

# అఫ్రిది రికార్డును బద్దలు కొట్టనున్న రోహిత్



భారత్, న్యూజిలాండ్ మధ్య కీలకమైన మూడవ వన్డే ఇండోర్‌లో జరగనుంది. భారత మాజీ కెప్టెన్, ఓపెనర్ రోహిత్ శర్మ మూడో వన్డేలో చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. వడోదరలో భారత్ మొదటి వన్డేలో గెలిస్తే, రాజ్‌కోట్‌లో జరిగిన రెండవ వన్డేలో న్యూజిలాండ్ విజయం సాధించాయి. దాంతో సిరీస్ 1-1తో సమం అయింది. హెూల్కర్ స్టేడియంలో జనవరి 18న జరిగే మూడవ వన్డే సిరీస్‌కు నిర్ణయాత్మక మ్యాచ్‌గా ఉంది. హిట్ మ్యాన్ రోహిత్ శర్మ బ్యాట్ నుంచి ఈ సిరీస్‌లో పరుగులు రాలేదు. ఇప్పటివరకు జరిగిన రెండు వన్డేల్లోనూ రోహిత్ త్వరగా ఔటయ్యాడు. వడోదరలో జరిగిన తొలి వన్డేలో రోహిత్ శర్మ 26 పరుగులు చేయగా, రెండో వన్డేలో 24 పరుగులకు ఔటయ్యాడు. ఇండోర్‌లో జరగనున్న మూడో వన్డేలో రోహిత్ బ్యాట్ నుంచి పరుగులు వస్తాయిని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ లలో రోహిత్ రాణించాడు. కానీ కివీస్ తో జరుగున్న వన్డే సిరీస్‌లో మాత్రం రోహిత్ శర్మ తడబాటుకు లోనవుతున్నాడు. త్వరగా వికెట్ సమర్పించుకోవడం భారత జట్టు ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపింది. మూడో వన్డే జరగనున్న ఇండోర్ హెూల్కర్ స్టేడయంలో 2 సంవత్సరాల క్రితం రోహిత్ అదే జట్టు న్యూజిలాండ్‌పై 101 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌పై వన్డేల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన విషయంలో పాకిస్తాన్ బ్యాటర్ షాహిద్ అఫ్రిది రికార్డును రోహిత్ బద్దలు కొట్టే అవకాశం ఉంది. న్యూజిలాండ్‌పై వన్డేల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు అఫ్రిది పేరిట ఉంది. విధ్వంసకర బ్యాటర్ అఫ్రిది కివీస్ మీద 50 సిక్సర్లు కొట్టాడు. రోహిత్ శర్మ ఇప్పటివరకు న్యూజిలాండ్‌పై వన్డేల్లో 49 సిక్సర్లు కొట్టాడు. ఇండోర్‌లో మరో 2 సిక్సర్లు కొట్టడం ద్వారా రోహిత్ పాక్ బ్యాటర్ షాహిద్ అఫ్రిది రికార్డును బద్దలు కొడతాడు. న్యూజిలాండ్‌పై వన్డేల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాట్స్‌మెన్‌గా నిలవనున్నాడు. ఓవరాల్‌గా అంతర్జాతీయ కెరీర్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా రోహిత్ ఉన్నాడు. కొన్ని నెలల కిందటే అఫ్రిది రికార్డును బద్దలుకొట్టాడు. ఇండోర్‌లో రోహిత్ శర్మ 5 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. 5 వన్డేలలో 205 పరుగులు చేశాడు. ఇక్కడ రోహిత్ ఒక సెంచరీ కూడా సాధించాడు. ఈ మైదానంలో వన్డే క్రికెట్‌లో 10 సిక్సర్లు, 18 ఫోర్లు కొట్టాడు రోహిత్. ఈ మైదానంలో అత్యధిక వన్డే పరుగులు చేసిన వారిలో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో స్థానంలో ఉన్నాడు. గిల్ ఇక్కడ 2 వన్డేల్లో 212 పరుగులు చేశాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు సాధించాడు. భారత కెప్టెన్ గిల్‌కు ఇది కలిసొచ్చిన స్టేడియం కావడం జట్టుకు కలిసిరానుంది. భారత్ జం న్యూజిలాండ్ మూడో వన్డే జనవరి 18 ( ఆదివారం) నాడు ఇండోర్‌లోని హెూల్కర్ స్టేడియంలో జరగనుంది. మ్యాచ్ మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభం అవుతుంది. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు టాస్ వేయనున్నారు. ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షంగా ప్రసారం చేస్తారు. లైవ్ స్ట్రీమింగ్ జీ (జియో హాట్‌స్టార్ యాప్), వెబ్‌సైట్‌లోనూ లైవ్ వీక్షించవచ్చు.

## పూరి-సేతుపతి మూవీ
# టైటిల్ స్లమ్ డాగ్


విజయ్ సేతుపతి -పూరి జగన్నాథ్ కాంబోలో రానున్న సినిమా టైటిల్ ఖరారయ్యింది. ఇప్పటివరకూ 'పూరి సేతుపతి'గా ప్రచారంలో ఉన్న ఈ సినిమా టైటిల్‌ను తాజాగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'స్లమ్ డాగ్' అనే పేరు ఖరారు చేశారు. '33 టెంపుల్ రోడ్' అనేది ఉపశీర్షిక. టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి ఆసక్తికర లుక్‌లో కనిపించారు. చేతిలో కత్తి పట్టుకొని కళ్లజోడుతో పవర్‌ఫుల్‌గా ఉన్నారు. ఈ పోస్టర్‌ను పంచుకున్న టీమ్ ఆసక్తికర క్యాప్షన్‌ను షేర్ చేసింది. 'మురికివాడల నుంచి ఎవరూ తట్టుకోలేని తుపాను వస్తుంది.. అది చాలా భయంకరంగా ఉంటుంది' అనే క్యాప్షన్ ఇందులో విజయ్ పాత్ర తీరును తెలిపేలా ఉంది. ఎన్నో రోజులుగా ఈ సినిమాకు రకరకాల టైటిల్స్ వినిపించాయి. ఇప్పుడు వాటికి చెక్ పెడుతూ 'స్లమ్ డాగ్'ను అధికారికంగా ప్రకటించారు.




గతేడాది జులై మొదటివారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి ఐదు నెలల్లోనే కంప్లీట్ చేసేశారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. సంయుక్త కథానాయికగా నటించారు. టబు (ఃజీశిబీ), విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రం ముస్తాబైంది. విజయ్ సేతుపతి ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.

# కలసి వచ్చిన సంక్రాంతి సెంటిమెంట్
## అనిల్ రావిపూడి, శర్వానంద్‌లకు పండగే పండగ

సంక్రాంతికి హిట్ కొట్టడం వేరు....అలాంటిది ఆ పండగకు వచ్చిన ప్రతిసారి విజయం అందుకున్నారు హీరో శర్వానంద్, డైరెక్టర్ అనిల్ రావిపూడి. పొంగల్ రిలీజ్.. అనిల్‌కు సెంటిమెంట్‌గా మారింది. వీలుంటే ప్రతి ఏడాదీ పండగకు వస్తాననంటుంటారు. సంక్రాంతికి వచ్చిన సినిమాలే కాదు అనిల్ తెరకెక్కించిన ఇతర సినిమాలన్నీ హిట్ అయిన సంగతి తెలిసిందే.సంక్రాంతికి తమ సినిమాలను రిలీజ్ చేయాలని ఎంతోమంది మేకర్స్ ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. కానీ, అది కొన్నిసార్లు వర్కౌట్ కాదు. దీంతో, కొన్ని సినిమాలు అకస్మాత్తుగా విడుదలవుతుంటాయి. సాధారణ రోజుల్లో పెద్ద హీరోల సినిమాలు రిలీజ్ అవుతున్నాయంటే.. చిన్న చిత్రాల మేకర్స్ వాటిని విడుదల చేసేందుకు సాహసించరు. పెద్ద పండగకు తప్పని సరిగా ప్రేక్షకులు ఆశీర్వదిస్తారన్న నమ్మకంతో రిలీజ్ చేస్తుంటారు. అలా ఈ ఏడాది విడుదలైన ప్రభాస్ 'ది రాజాసాబ్', చిరంజీవి సినిమా, రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో పాటు శర్వా మూవీ, నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సందడి చేస్తున్నాయి.సంక్రాంతి సందర్భంగా 'ఎక్స్‌ప్రెస్ రాజా'తో 2016లో శర్వా తొలి విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. ప్రేమించిన అమ్మాయి పెంచుకున్న కుక్క కనిపించకపోవడంతో.. దాన్ని వెతికి పట్టుకునే క్రమంలో హీరోకి ఎలాంటి సంఘటనలు ఎదురయ్యాయి? అన్న పాయింట్‌తో మేర్లపాక గాంధీ తెరకెక్కించిన రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ ఇది. మరుసటి ఏడాది సంక్రాంతికి 'శతమానం భవతి'తో అంతకుమించిన సక్సెస్ చూశారు శర్వానంద్. కుటుంబ విలువలు గుర్తుచేసేలా సతీశ్ వేగేశ్న తెరకెక్కించిన ఫ్యామిలీ డ్రామా ఇది. ఈ ఏడాది 'నారీ నారీ నడుమ మురారి' గా నవ్వులు పంచారు. ఇద్దరమ్మాయిల మధ్య నలిగిపోయే యువకుడి కథాంశంతో రామ్ అబ్బరాజు తెరకెక్కించిన ఈ సినిమా థియేటర్లలో నవ్వులు పూయిస్తోంది. ఈ మూడు సినిమాలు జనవరి 14న విడుదల కావడం విశేషం. ప్రేక్షకులను నవ్వించడమే లక్ష్యంగా సినిమాలు చేస్తూ వరుస విజయాలు అందుకుంటున్న దర్శకుడు అనిల్ రావిపూడి. వెంకటేశ్, వరుణ్‌తేజ్ కాంబినేషన్‌లో ఆయన తెరకెక్కించిన 'ఎఫ్ 2' 2019 జనవరి 12న రిలీజైంది. ఈ మూవీ రూ.100 కోట్లకుపైగా వసూలు చేసింది. 2020 జనవరి 11న విడుదలైన మహేశ్‌బాబు 'సరిలేరు నీకెవ్వరు' దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. 2025 జనవరి 14న విడుదలైన వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఏకంగా రూ.300 కోట్లు వసూలు చేసి, ఈ హీరో- దర్శకుడి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ నెల 12న విడుదలైన చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్‌గారు' సైతం జోరు ప్రదర్శిస్తోంది. మూడు రోజుల్లోనే రూ.152 కోట్లు కలెక్ట్ చేసింది.








# ప్రభాస్ 'స్పిరిట్' రిలీజ్ డేట్ వచ్చేసింది!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'స్పిరిట్' విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటనతో ప్రభాస్ అభిమానుల ఎదురుచూపులకు తెరపడింది.ఈ సినిమాను టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ పతాకాలపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హీరో ప్రభాస్, చిత్ర నిర్మాణ సంస్థలు, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఈ రిలీజ్ డేట్‌ను పంచుకున్నారు. 'స్పిరిట్' ఒక హైఓల్టేజ్ కాప్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో ప్రభాస్ ఒక శక్తివంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. 'యానిమల్' బ్యూటీ తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీతో పాటు మొత్తం తొమ్మిది భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్‌ల తర్వాత సందీప్ వంగా దర్శకత్వంలో వస్తున్న సినిమా కావడంతో 'స్పిరిట్'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీలో అనిల్ కపూర్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, పాన్ ఇండియా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'డ్రాగన్' ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు పెంచుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ భాగమవుతున్నారనే వార్తలు మరింత హీట్ పెంచుతున్నాయి. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణబీర్ కపూర్ తండ్రిగా అనిల్ కపూర్ చేసిన పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి. వయసు పెరిగిన తర్వాత కూడా పవర్‌ఫుల్ క్యారెక్టర్లతో తన మార్క్ చూపిస్తున్న అనిల్, ఇప్పుడు 'డ్రాగన్'లో కూడా అంతే బలమైన పాత్రలో కనిపించబోతున్నారనే చర్చ నడుస్తోంది. ఐఎండీబీ మోస్ట్ యాంటిసిపేటెడ్ ఇండియన్ మూవీస్ జాబితాలో 'డ్రాగన్' చోటు దక్కిన విషయాన్ని పరోక్షంగా హైలైట్ చేస్తూ, ఈ ప్రాజెక్ట్‌పై తన ఆసక్తిని అనిల్ కపూర్ వ్యక్తం చేశారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో సీనియర్ నటుల పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందన్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్'లో సంజయ్ దత్‌ను భీకరమైన విలన్‌గా చూపించి కొత్త కోణంలో ఆవిష్కరించారు. అలాగే 'సలార్'లో జగపతి బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్రలు కథకు బలమైన స్థంభాలుగా నిలిచాయి. అదే తరహాలో 'డ్రాగన్'లో అనిల్ కపూర్ పాత్ర కూడా కథను మలుపు తిప్పే స్థాయిలో ఉంటుందనే అంచనాలు పెరుగుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, ప్రశాంత్ నీల్ స్టైల్ మాస్ యాక్షన్‌తో పాటు స్టాం÷-రగ్ ఎమోషనల్ క్యారెక్టర్ల మేళవింపుగా ఉండబోతుందని టాక్.



# దేవి శ్రీ ప్రసాద్ హీరోగా 'ఎల్లమ్మ'...

ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ (డీఎస్పీ) హీరోగా అరంగేట్రం చేయబోతున్నారు. 'బలగం' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకుడు వేణు యెల్దండి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఎల్లమ్మ' సినిమాలో ఆయన కథానాయకుడిగా నటిస్తున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం ఈ చిత్ర కాన్సెప్ట్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది.ఈ గ్లింప్స్‌లో 'పర్షి' అనే పాత్రలో దేవిశ్రీ ప్రసాద్‌ను పరిచయం చేశారు. పొడవాటి జుట్టు, గడ్డంతో, ఒంటిపై చొక్కా లేకుండా డప్పు వాయిస్తూ డీఎస్పీ సరికొత్త అవతారంలో కనిపించారు. గాలికి తిరుగుతున్న వేపాకు, తుపాను, మేక... ఆధ్యాత్మిక, జానపద అంశాలతో కూడిన విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం జానపద నేపథ్యంతో కూడిన ఒక మ్యూజికల్ సోషల్ డ్రామాగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది.ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు డీఎస్పీనే సంగీతం అందిస్తుండగా, టీ-సిరీస్ సంస్థ మ్యూజిక్ హక్కులను సొంతం చేసుకుంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా చిత్రంగా 'ఎల్లమ్మ'ను విడుదల చేయనున్నారు.గతంలో ఈ ప్రాజెక్టులో వేరే హీరోల పేర్లు వినిపించినప్పటికీ, చివరికి డీఎస్పీనే ఖరారయ్యారు. త్వరలోనే మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను ప్రకటించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఈ ఏడాదిలోనే సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



# అందాల ఆషిక..
## ఇప్పుడు ఆమెనే యూత్ డ్రీమ్ గర్ల్!

టాలీవుడ్ యూత్ ఫోకస్ పడిన బ్యూటీల్లో ఇప్పుడు అందాల ఆషిక రంగనాథ్ పేరు గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే కన్నడ సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, క్రమంగా తెలుగు సినీ ఇండస్ట్రీలో కూడా తనదైన ముద్ర వేసేందుకు ప్రయత్నం చేస్తోంది. వివిధ కన్నడ చిత్రాలతో మెప్పించిన బ్యూటీ.. నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన అమిగోస్ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. డెబ్యూతో అందరినీ ఆకట్టుకుందని చెప్పాలి. ఆ తర్వాత కింగ్ నాగార్జున లీడ్ రోల్ పోషించిన నా సామి రంగ సినిమాతో మరింతగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆషిక.. ఈ సంక్రాంతికి విడుదలైన భర్త మహాశయులకు విజ్ఞప్తితో ఇప్పుడు థియేటర్స్ లో సందడి చేస్తోంది. మూవీలో ప్రత్యేకమైన పాత్రలో, వివాహితుడైన హీరోకి గర్ల్‌ఫ్రెండ్ గా ఆషిక కనిపించారు. స్టోరీ పరంగా సున్నితమైన పాత్ర అయినప్పటికీ, ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమా మొత్తంలో ఆమె పాత్రకు ఉన్న ఇంపార్టెన్స్, గ్లామర్ తో పాటు క్యారెక్టర్ ఫ్రెష్ నెస్ ను కూడా చూపించడంతో.. మూవీ రిలీజ్ అయ్యాక ఆమె కోసం జోరుగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఏడాది సంక్రాంతి సీజన్ లో ఒకేసారి పలు చిత్రాలు పోటీగా ప్రేక్షకుల ముందుకు వచ్చినా.. ఆషిక నటనపై ప్రత్యేకంగా మాట్లాడుకోవడం విశేషం. సోషల్ మీడియాలో ఆమె కోసమే డిస్కషన్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం నెట్టింట ఆషిక ఫోటో షూట్లు, సినిమా క్లిప్పులు వైరల్ కావడం, ఫ్యాన్ పేజీలు పెరగడం చూస్తే, టాలీవుడ్ యూత్ డ్రీమ్ గర్ల్ ఆమెనే అని అనిపిస్తోంది. భర్త మహాశయులకు విజ్ఞప్తి మూవీ కథలో పెద్ద ఎమోషనల్ సీన్లు లేకపోయినా, తన పాత్ర పరిధిలో అమ్మడు ఆకట్టుకునేలా కనిపించిందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. చాలా బాగా నటించారని అంతా కొనియాడుతున్నారు.పోతే ఆ సినిమా చూసి పడుకునేవాడిని అదే సమయంలో యాక్టింగ్ పరంగా ఇంకాస్త డెవలప్ అయితే ఇంకా సూపర్ అని అంటున్నారు. డైలాగ్ డెలివరీ, ఎమోషన్స్ ఎక్స్ప్రెస్ చేయడంలో ఇంకా మెళకువలు నేర్చుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడు ఇండస్ట్రీలో గ్లామర్ హీరోయిన్ గానే కాకుండా స్ట్రాంగ్ యాక్ట్రెస్ గా సత్తా చాటవచ్చుని, భారీ అవకాశాలు వస్తాయని చెబుతున్నారు. తద్వారా స్టార్ హీరోయిన్ గా మారగలరని అంటున్నారు. ఇక ఆషిక రంగనాథ్ అప్ కమింగ్ చిత్రాలపై కూడా అందరి దృష్టి పడింది. మరికొద్ది రోజుల్లో ఆమె విశ్వంభర సినిమాతో థియేటర్స్ లోకి రానున్నారు. మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్ లో నటించిన ఆ మూవీ.. సమ్మర్ లో విడుదల కానుంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613